## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది
కుళ్ళిపోయినట్టి కూరలు పండ్లును
కుళ్ళు బోతు తనము గుణమునున్న
పనికిరావు నొకటి పగతుడౌను నొకరు
జగతినందు జరుగు సత్యమిదియె
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి



RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు
తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.



సంచిక 60 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | ఆగస్టు 28, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


## దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

- ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమం
- క్రీడాకారులకు ప్రధాని మోడీ శుభాకాంక్షలు



న్యూఢిల్లీ,ఆగస్టు 27 : దేశ యువత, క్రీడాకారులకు ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో ఆయన వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ అలథెట్స్‌తో ప్రధాని మోదీ వర్చువల్‌గా సంభాషించారు. అనంతరం యువతను ఉద్దేశించి ప్రసంగించారు. క్రీడలంటే కేవలం మెడల్స్ కాదని.. యువతలో ఉన్న చైతన్యాన్ని మేల్కొలిపే సాధనాలనీ మోదీ చెప్పుకొచ్చారు. ఆటలు యువశక్తిని వెలికితీస్తా_యన్నారు. దేశం అభివృద్ధి పథంలో దూసుకు పోవడానికి యువశక్తితో మిగతా2లో...

### మీరాలం చెరువుకు

# మహార్దశ

- పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం
- పనులను పరిశీలించిన సిఎం రేవంత్



హైదరాబాద్,ఆగస్టు 27 : హైదరాబాద్ నగరంలోని చారిత్రక ప్రాధాన్యం కలిగిన మిర్ ఆలం చెరువుకు తెలంగాణ ప్రభుత్వం సరికొత్త హంగులు అద్దబోతోంది. కుటుంబ సమేతంగా వచ్చి రోజంతా ప్రకృతి అందాలు, జలక్రీడలు , వినో దాన్ని ఆస్వాదించేలా దీనిని అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గురువారం మిర్ ఆలం చెరువును అకస్మి కంగా పరిశీలించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొ రేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సుందరీకరణ పనులు , సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ పురోగతిని అధికారులతో మిగతా2లో...

## యశోదాలో గవర్నర్‌కు సిఎం పరామర్శ



హైదరాబాద్,ఆగస్టు 27 :అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలిసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

## ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

- అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం
- కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదన్న మహేశ్ గౌడ్



నిజామాబాద్,ఆగస్టు 27 : మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ మిగతా2లో...

## 1,600 మంది గల్లంతు



నేపాల్,ఆగస్టు 27 : నేపాల్-టిబెట్ సరహద్దుల వెంబడి సంభవించిన మెరుపు వరదల బీభత్సంలో 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ప్రకటించింది. మరో 200 మంది భారతీయ పౌరులు చైనా వైపు టిబెట్‌లో చిక్కుకుపోయినట్టు తెలిపింది. వారికి సహాయం అందించేందుకు రెండు దేశాల అధికారులతో భారత్ నిరంతరం సంప్రదింపులు జరుపు తున్నట్టు పేర్కొంది. నేపాల్‌లో సహాయక చర్యలు వేగం పుంజుకున్న నేపథ్యంలో సంక్షోభాన్ని అధిగమించేందుకు ఆ దేశానికి భారత్ భుజం భుజం కలిగి అండగా మిగతా2లో...

## బిఆర్ఎస్ హస్తగతానికి హరీష్‌రావు కుట్ర: కల్వకుంట్ల కవిత



హైదరాబాద్,ఆగస్టు 27 :బిఆర్ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు ఆ పార్టీ నేత హరీష్ రావు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. ఇందుకోసం తెరవెనుక కుట్రలు చేస్తున్నాడని విమర్శించారు. ఇటీవలే మెదక్ జిల్లా ఎంఎల్ఎలతో హరీష్ రహస్య మంతనాలు నిర్వహించారని, ఆ సమావేశంలో ఉన్న ఒకరు తనకు ఈ విషయాలు చెప్పారని అన్నారు. కెసిఆర్ వారసత్వం కెటిఆర్‌కు రావద్దని ఆ సమావేశంలో మిగతా2లో...



## కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి: హరీశ్‌రావు

హనుమకొండ,ఆగస్టు 27 : పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమ కొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా మిగతా2లో...

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

- మరో 25 ఏళ్లపాటు ఇలాగే కొనసాగాలి
- ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
- తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్



న్యూఢిల్లీ,ఆగస్టు 27 : లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన మిగతా2లో...

## ఎలక్ట్రిక్ ఆటోలకు రూ. లక్షన్నర సబ్సిడీ



హైదరాబాద్,ఆగస్టు 27 :రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు రవాణా రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ కోర్ అర్బన్ పరిధిలో వాయు, శబ్ద కాలుష్యాలను తగ్గించడంతో పాటు ఆటో డ్రైవర్లపై ఇంధన భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా 'తెలంగాణ ఆటోరిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్- 2026'ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ పథకం ద్వారా తొలి విడతలో భాగంగా 18,766 పెట్రోల్, డీజిల్ ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ కోసం ప్రభుత్వం రూ.200 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. హైదరాబాద్‌లోని కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని(ఓఆర్ఆర్ లోపు) పాత పెట్రోల్, డీజిల్ ఆటో డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. మిగతా2లో...

## ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

- 80 మంది సంస్థ యాత్రికులు వరదల్లో గల్లంతు
- కన్నీటి పర్యంతం అయిని జగ్గీవాసుదేవ్



2లో

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644



# మీరాలం చెరువుకు మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించిన సీఎం, పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. లక్ష్యంగా పెట్టుకున్న 544 పైల్స్‌లో 273 (50.18 శాతం) పైల్స్ పూర్తి కాగా, 62 పైల్ క్యాప్స్‌లో 28 (45.16 శాతం) పనులు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. చెరువు పునరుజ్జీవనం, చెరువు పరిసర ప్రాంతాలు , ఐలాండ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా చెరువులోకి ఎలాంటి మురుగు నీరు చేరకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, వర్షపు నీరు మూసీ నదిలోకి సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించి నీటి నాణ్యతను పెంచాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

యువతతో పాటు కుటుంబాలను ఆకట్టుకునేలా మిర్ ఆలం చెరువులో బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ కార్యకలాపాలను అందుబాటులోకి తేనున్నారు. పర్యావరణ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా చెరువు చుట్టూ ఫుడ్‌కోర్టులు, పచ్చని పార్కులు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు , వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు కానున్నాయి. అంతేకాకుండా, చెరువులో ఉన్న ఐలాండ్లను ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలుగా, టెంట్లు వేసుకునే గ్లాంపింగ్ స్పాట్లుగా , డెస్టినేషన్ వెడ్డింగ్స్, ఈవెంట్లకు అనుకూలమైన వేదికలుగా రూపుదిద్దనున్నారు. ఈ నాణ్యమైన సౌకర్యాల కోసం పిపిపి విధానంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి స్థానికులకు ఉపాధి కల్పిస్తారు. సమీపంలోనే ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుతో మిర్ ఆలం ట్యాంక్ అభివృద్ధిని సమగ్రంగా అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. దీనివల్ల జూ పార్క్ సందర్శనకు వచ్చే పర్యాటకులు ఒకే పర్యటనలో చెరువు అందాలు, జలక్రీడలు , కుటుంబ వినోదాన్ని పొందగలుగుతారు. విమానాశ్రయానికి సమీపంలో ఉండే ఈ చారిత్రక ప్రాంతం అభివృద్ధి చెందితే, హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశ, విదేశీ పర్యాటకులకు మిర్ ఆలం ట్యాంక్ ఒక ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా మారనుంది.

# ఘనంగా మాచారెడ్డి పీఏసీఎస్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

## • రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం • ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



**హైదరాబాద్,ఆగస్టు 27 :** మాచారెడ్డి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్‌గా నౌసిలాల్ నాయక్ తోపాటు పాలకవర్గ సభ్యులు పమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ.రైతుల సంక్షేమమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతు బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతులకు అవసరమైన రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందించడంలో పీఏసీఎస్‌లు కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, సాగునీటి వనరుల అభివృద్ధి, రైతు బీమా వంటి కార్యక్రమాలతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మాచారెడ్డి పీఏసీఎస్ నూతన చైర్మన్ నౌసిలాల్ నాయక్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపిన షబ్బీర్ అలీ రైతులు పాలకవర్గంపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు సమానంగా సేవలు అందించాలని సూచించారు. సంఘంను ఆర్థికంగా బలోపేతం చేస్తూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాచారెడ్డి మాజీ ఎంపీపీ సురేష్ నర్సింగరావు, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, మాచారెడ్డి సర్పంచ్ సంతోష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు రెడ్డి నాయక్, భిక్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, తిప్పాపూర్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, కామారెడ్డి సొసైటీ చైర్మన్ గూడెం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, కౌన్సిలర్ మోతిలాల్, డీసీసీ ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్, మాజీ సొసైటీ చైర్మన్లు పూల్ చంద్, స్వామిగౌడ్, రాజమౌళి, సత్యనారాయణ, బాలరాజుగౌడ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు రాజిరెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ ఆటోలకు రూ. లక్షన్నర సబ్సిడీ

(మొదటి పేజీ తరువాయి)

దీని ద్వారా డ్రైవర్ల కోసం రెండు ప్రధాన ఆప్షన్లను అధికారులు అందుబాటులోకి తెచ్చారు.మొదటి ఆప్షన్ కింద ఉన్న పాత ఆటో ఇనుప చట్రం(ఫ్రేమ్)ను అలాగే ఉంచి, పెట్రోల్ లేదా డీజిల్ ఇంజిన్ స్థానంలో ఏఐఎస్ 123 ప్రమాణాలు కలిగిన ఎలక్ట్రిక్ కిట్‌ను (ఫిక్స్‌డ్ లేదా స్వాపింగ్ బ్యాటరీతో) అమర్చుకోవచ్చు. రెండవ ఆప్షన్ కింద పాత ఆటోను స్క్రాప్ చేసి, కొత్త ఎలక్ట్రిక్ ఆటోను కొనుగోలు చేయవచ్చు. ఈ ప్రక్రియ మొత్తాన్ని 16 వారాల ప్రణాళికతో ఆన్‌లైన్ ద్వారా పూర్తి పారదర్శకంగా అమలు చేయనున్నారు. ఇలా కొత్త ఈవీ ఆటోలను కొనుగోలు చేసే డ్రైవర్లకు ప్రభుత్వం రూ.1.5 లక్షల వరకు సబ్సిడీని అందజేయనుంది. ఈ పథకం అమల్లోకి వస్తే ఆటో డ్రైవర్లకు ఇంధన ఖర్చులు పూర్తిగా తగ్గి ఆర్థికంగా భారీ లబ్ది చేకూరనుంది. అలాగే, నగరంలో కాలుష్యం గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. త్వరలోనే ఈ ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది.



# యథావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు

(మొదటి పేజీ తరువాయి)

బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూట మి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమి టేషన్ పక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పం దన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

హరీశ్ మాట్లాడుతూ.. 97 జివొను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాన విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకు ముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టిఎన్‌జివొలు నిర్వహించిన ధర్నాలో హరీశ్ రావు మద్దతు తెలిపారు. దీంతో పోలీసులు అయన్ను అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.

# రాష్ట్ర ప్రజలకు మంత్రి పొన్నం రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

**హైదరాబాద్,ఆగస్టు 27 :**
రాష్ట్ర ప్రజలకు రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే ఈ పవిత్రమైన రోజున ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం వెల్లివిరియాలని ఆకాంక్షించారు.తెలంగాణ ఆడబిడ్డల సంక్షేమం, భద్రత, సాధికారతకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాఖీ పౌర్ణమి పండుగను రాష్ట్ర ప్రజలందరూ సోదరభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని కోరారు.

# దేశాభివృద్ధిలో యువత, క్రీడాశక్తి ఎంతో ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

పాటు క్రీడాశక్తి కూడా ఎంతో అవసరమని మోదీ పేర్కొన్నారు. భారత్ ఒలింపిక్స్‌లో తగిన ప్రాతినిధ్యం వహించట్లేదని ప్రధాని విచారం వ్యక్తం చేశారు. దేశం క్రీడలపై ఎక్కువగా ఆసక్తి చూపడంలేదన్నారు. 2012లో ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత్.. 12 ఆటల్లో మాత్రమే మెడల్స్ సాధించిందని తెలిపారు. సర్ఫింగ్ వంటి ఆటల్లో మన క్రీడాకారులు ఎందుకు పాల్గొనడం లేదని ప్రశ్నించారు. దేశంలో ప్రతిభకు లోటు లేదని, మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టిందని తెలిపారు. ముఖ్యంగా 5 నుంచి 15 ఏళ్ల వారిలో టాలెంట్‌ను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ చెప్పుకోదగ్గ స్థాయిలో పథకాలను సాధించాలని ఆయన కోరారు. ఇందుకోసం ప్రభుత్వం.. క్రీడాకారులు, అలథెట్లకు సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామి ఇచ్చారు. డిసెంబర్‌లో జరిగే 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

# 1,600 మంది గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తుందని ప్రకటించింది. ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ గురువారంనాడిక్కడ మీడియాతో ఆ వివరాలు తెలియజేశారు. 'ఆచూకీ తెలియకుండా పోయిన 288 మంది భారతీయుల్లో త్రిశూలి-1 విద్యుత్ ప్రాజెక్టులో పనిచేస్తున్న 73 మంది ఉన్నారు. ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం వారి ఆచూకీ కోసం ప్రాజెక్టు అధికారులతో సంప్రదిస్తోంది.తమిళనాడు నుంచి 37 మంది, 49 మందితో కూడిన రెండు పర్యాటక బృందాలు ఉన్నాయి. వీరు సమ్రాట్, షై ఎవరెస్ట్ ట్రావెల్ ఏజెన్సీల ద్వారా కైలాస్ మానసరోవర్ యాత్రకు వెళ్లారు. పశ్చిమబెంగాల్ నుంచి 32 మంది, కేరళ నుంచి 33 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 62 మంది ఉన్నారు. సహాయక చర్యల విషయంలో నేపాల్ అధికారులతో సంప్రదిస్తున్నాం' అని జైశ్వాల్ చెప్పారు. ఇంతవరకూ తమిళనాడుకు చెందిన 21 మందిని కాపాడినట్టు జైశ్వాల్ తెలిపారు. చైనా వైపు 200 మంది భారతీయులు కోసం విజ్ఞప్తి చేస్తున్నారని చెప్పారు. వీరిలో 95 మంది గార్చన్‌లో ఉన్నారని, వారు నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ముందుకు సాగుతున్నారని చెప్పారు. మరో నలుగురు గీలాంగ్ నగరంలో, 13 మంది జుటుల్పుక్‌లో ఉన్నారన వివరించారు. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పరిస్థితి ఎక్కడికప్పుడు మారుతోందన్నారు. భారతీయులను రక్షించేందుకు సంబంధిత అధికారులతో భారత నిరంతం సంప్రదింపులు సాగిస్తోందన్నారు.

# ఈషా ఫౌండేషన్‌లో విషాద ఛాయలు

**చెన్నై,ఆగస్టు 27** ఈశా ఫౌండేషన్‌కు చెందిన 80 మంది యాత్రికులు నేపాల్ వరదల్లో గల్లంతైన నేపథ్యంలో సంస్థలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సద్గురు అనుచరులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. సాధారణంగా నవ్వుతూ కనిపించే సద్గురు జగ్గీ వాసుదేవ్ కూడా దుఃఖాన్ని అణుచుకోలేక పోయారు. కైలాశ్ యాత్ర అనంతరం ఈశా ఫౌండేషన్ యాత్రికులు టిబెట్‌లోని గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్న సమయంలో వరద ముంచెత్తినట్టు తెలుస్తోంది. టిబెట్‌లో జరిగిందని చెబుతూ సద్గురు కన్నీటిపర్యంతమయ్యారు. గురువారం అక్కడికి వెళదామ నుకున్నా కుదరలేదని చెప్పారు. గల్లంతైన వారి గురించి ఇప్పటివరకూ తమకు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని అన్నారు. పరిస్థితి చాలా దారుణంగా కనిపిస్తోందని భావోద్వేగానికి లోనయ్యారు. గ్యిరాంగ్ ఇమిగ్రేషన్ సెంటర్‌లో ఈశా యాత్రికుల బృందం ఉన్న సమయంలో ఆ ప్రాంతాన్ని వరద ముంచెత్తిందని చెప్పారు. తాము ఇమిగ్రేషన్ సెంటర్‌కు వచ్చినట్టు ఈశా గ్రూప్ లీడర్ ప్రవీణ్ నుంచి తనకు ఉదయం 9.05 గంటలకు మెసేజీ వచ్చిందని సద్గురు చెప్పారు. ఆ తరువాత 9.14కు ఆ భవన సముదాయాన్ని వరద ముంచెత్తిందని అన్నారు. గ్రూప్ లీడర్ ప్రవీణ్‌తో ఈశా ఫౌండేషన్ రెండు దశాబ్దాలకు పైగా అనుబంధం ఉందని చెబుతూ కన్నీటి పర్యంత మయ్యారు. కొన్ని క్షణాలకు తేరుకున్న ఆయన మళ్లీ మాట్లాడుతూ ప్రవీణ్ వద్ద ఉన్న నేపాల్ ఫోన్ నెంబర్ ఆ రోజంతా యాక్టివ్‌గా లేదని చెప్పారు. 'ఆయన దాటి వచ్చి ఉంటే నేపాల్ ఫోన్ యాక్టివ్ అయ్యి ఉండేది. కానీ అలా జరగలేదు. అంటే, గ్రూప్ మొత్తం ఇమిగ్రేషన్ సెంటర్‌లోనే ఉండి ఉంటుంది' అని తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తాను మరికొంత మందితో కలిసి అక్కడికి వెళ్లేందుకు భారత్, చైనాల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. టిబెట్‌లో మంచు చరియలు విరిగిపడటంతో అక్కడి నదిలో పోటెత్తిన వరద దిగువ ఉన్న నేపాల్‌లో జలప్రయళం సృష్టించినట్టు తెలుస్తోంది. ఈ ఘటనలో 170 మంది మరణించగా, 1500 మంది గల్లంతయ్యారు. ఈ ఘటనలో గల్లంతైన భారతీయుల్లో 100 మంది ఆచూకీ తెలిసినట్టు సమాచారం.

# ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వ లేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# బిఆర్‌ఎస్ హస్తగతానికి హరీష్‌రావు కుట్ర: కల్వకుంట్ల కవిత

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారని చెప్పారు. బిఆర్‌ఎస్‌ను హస్తగతం చేసుకునేందుకు సిఎం రేవంత్‌రెడ్డితో, బిజెపితో దోస్తానా చేస్తున్నారని ఆరోపించారు. బిజెపితో హరీష్ రావు దోస్తీకి సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయన్నారు. ఇప్పుడు తాను బిఆర్‌ఎస్‌లో లేను అని, ఆ పార్టీ ఎటు పోయినా తనకు సంబంధం లేదని అన్నారు. కానీ హరీష్‌రావు గురించి ప్రజలకు తెలియాలనే ఈ విషయం బయటకు చెబుతున్నానన్నారు.

.తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రావాళ్ల చేతిలో బందీ అయ్యారని మండిపడ్డారు. బ్రహ్మణ పరిషత్‌కు ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ను ఆంధ్రావాళ్లను నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్‌గా ఉన్న బసవరాజు శ్రీనివాస రాజు అనే వ్యక్తి పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని, తెలంగాణను ఉద్యమ సమయంలో రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన వ్యక్తికి ఆ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తెలంగాణ బ్రహ్మణులలో అర్హులు లేరా..? అని నిలదీశారు.యాదగిరి గుట్ట బోర్డు మెంబర్లలో ఆంధ్రా హీరో భార్యకు పదవి కట్టబెట్టారని విమర్శించారు. తెలంగాణ వాళ్ల పైసలతో కట్టిన గుడిలో ఆంధ్రావాళ్లకు పెత్తనం ఎలా ఇస్తారన్నారు. జనసేనకు చెందిన ఓ ఎంపీ కుమారుడు 6 కోట్ల కారు వేసుకోని ఒడిశాకు చెందిన 25 ఏళ్ల అమ్మాయిని గుద్ది చంపితే సిఎం పట్టించుకోలేదని పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులపై అవగాహన సదస్సు నిర్వహణ



**ఖానాపూర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** శాంతినగర్ కాలనీ 9వ వార్డులో గురువారం నిర్వహించిన ఎస్ఐఆర్ సర్వే వార్డు సభలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక మహేందర్ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన సర్వేలో ఇంటి పేర్లు, వివరాలు తప్పుగా ఉన్నవారు మళ్లీ సవరణ చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందజేసి సరైన వివరాలు నమోదు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సర్వే సూపర్వైజర్ కిషన్, బీఎల్ఓలు అజయ్ కుమార్, కొండ రాజలింగు, రాజు, బీఎల్ఏలు, యువకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**ఖానాపూర్ ఆగస్టు 27( నీలగిరి ఎక్స్ప్రెస్ ) :** ఖానాపూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల ముందస్తుగా గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలురకు బాలికలచేలు పట్టించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాడ భీమ లింగం మాట్లాడుతూ రక్షాబంధన్ అనునది అన్నయ్యకు అక్క చెల్లె రాఖీ కట్టి తన యొక్క వాత్సల్య మునకు నిదర్శనము అన్నారు. పాఠశాలలో బాల బాలికలు అన్నదమ్ములు అక్క చెల్లెలు వలే కలిసిమెలిసి చదువుకొని ఉన్నత చదువులను చదివి అభివృద్ధి రావాలని అన్నారు. ఈ కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు భీమ లింగం, సహోపాధ్యాయులు శ్యామ కృష్ణ ప్రసాద్, కే మౌనిక లు పాల్గొన్నారు.

## గ్రామసభల్లో ఎస్ఐఆర్ నోటీసులపై అవగాహన



**ఖానాపూర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో ఎస్ఐఆర్ సర్వేకు సంబంధించి ప్రజలకు అధికారులు అవగాహన కల్పించారు. వివిధ కారణాలతో పలువురికి నోటీసులు జారీ చేసినట్లు వివరించి, వాటిలో ఏవైనా లోపాలు ఉంటే త్వరగా సరిచేసు కోవాలని సూచించారు. ప్రజలకు నోటీసుల వివరాలు, తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టతనిచ్చారు.దిలావర్పూర్ గ్రామంలో జరిగిన సభలో సర్పంచ్ చింతల మల్లేష్, ఉప సర్పంచ్ ఒరగంటి రాజేశ్వర్, బీఎల్ఓ పంబాల లక్ష్మి, జిపిఓ భాగ్యలక్ష్మి, బీఎల్ఓ వాల్గాట్ సాయికిరణ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, కారోబార్ పోశెట్టి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జెడ్పీహెచ్ఎస్‌లో సాంఘిక శాస్త్ర మేళా




**ఖానాపూర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సాంఘిక శాస్త్ర మేళా ఘనంగా జరిగింది. ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు సాంఘిక శాస్త్రానికి సంబంధించిన చార్టులు, మ్యాపులు, వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. భూగోళశాస్త్ర నమూనాలను రూపొందించి వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి, పాఠ్యాంశాలపై అవగాహన పెంచడానికి ఇటువంటి మేళాలు దోహదపడతాయని తెలిపారు. ప్రయోగాత్మక అభ్యాసం అలవర్చుకోవాలని సూచించారు.మేళా విజయవంతం కావడానికి మార్గదర్శకత్వం వహించిన గైడ్ టీచర్ మేకల చందనను, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు




**కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా విద్యా సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని, సోదరులు సోదరీమణులకు ఎల్లప్పుడూ అండగా నిలిచి రక్షణగా ఉంటారని తెలిపారు. కుటుంబ బంధాలు, సోదరభావం, మతసామరస్యాన్ని పెంపొందించే పండుగగా రక్షాబంధన్ ప్రత్యేకతను వివరించారు.వేడుకల్లో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలకు నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్న విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టి సోదర భావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో ఎకో క్లబ్ కార్యక్రమం నిర్వహణ



**రామడుగు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రామడుగు మండలంలోని కొరటపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో మిషన్ లైఫ్ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు లవన్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయని, వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచి ంచారు .కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగుల మహాధర్నా



**నిర్మల్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ టి.జి.ఈ.జె.ఏ.సి పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలో మహా ధర్నా జరిగింది. వేలాదిమంది పట్టుదలగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా టి.జి.జె.ఏ.సి అధ్యక్షుడు వి. ప్రభాకర్, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, ఆరు డీఏలు విడుదల చేయాలని, పదివేల కోట్ల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని, ఎన్ఈహెచ్ఎస్ కార్డులు అందించాలని కోరారు.రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం.సి. లింగన్న మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, జిపిఎఫ్, టీఎస్‌జిఎల్ఐ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని అన్నారు. గతంలో పీఆర్సీ అమలు తేదీ నుండి నగదు ఇవ్వకుండా నోషనల్ ఇవ్వడం వల్ల ఉద్యోగులు భారీ నష్టపోయారని, ఈసారి పూర్తి నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన యాదవ్, జే. లక్ష్మణ్, పీఆర్టీయూ అధ్యక్షుడు నరేంద్రబాబు, రమణారావు, యుటిఎఫ్ అశోక్, రవికాంత్, డిటిఎఫ్ మహేంద్ర చారి, హెచ్ఎం అసోసియేషన్ మహేందర్, ఎస్సీ--ఎస్టీ రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని 19 మండలాల నుండి ఉపాధ్యాయులు, రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# టీజీఈజేఏసీ మహా ధర్నా ఘన విజయం



**పెద్దపల్లి, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ గేట్ వద్ద మహా ధర్నా జరిగింది.జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది తరలివచ్చి ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. జానపద కళాకారుల గీతాలు, నృత్యాలతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా టీజీఈజేఏసీ చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు విడుదల, సిపిఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల అమలు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, జీవో-25 సవరణ, జీవో-190 అమలు వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కన్వీనర్ తూము రవీందర్, టీఎస్జీఓ జిల్లా కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి, రాష్ట్ర నాయకులు సందీప్ రావు, గోపు అనిత, కొమురయ్యతో పాటు వివిధ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు."ఉద్యోగుల ఐక్యతే విజయానికి మార్గం", "మా హక్కులు సాధించే వరకు పోరాటం కొనసా గుతుంది" అనే నినాదాలతో మహా ధర్నా విజయవంతంగా ముగిసింది.

# బాలికల రక్షణ, విద్య, సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది దయా అరుణ



**సుల్తానాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బాలికల రక్షణ, విద్య, సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది అని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు.బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఓల్డ్ ఏజ్ హోమ్, వికలాంగుల పాఠశాల, చిల్డ్రన్స్ హోమ్, పలు సంక్షేమ హాస్టళ్లలో రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి మాత్రమే కాకుండా మహిళల భద్రత, సమానత్వం, సామాజిక బాధ్యతలకు ప్రతీక అని పేర్కొన్నారు.బాలికలను భారంగా కాకుండా భవిష్యత్ తరాల నిర్మాణకర్తలుగా చూడాలని, వారికి సమాన విద్యావకాశాలు కల్పించాలని, బాల్య వివాహాలు, హింస, వివక్ష, బాల కార్మికత్వం నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక సాధికారత కోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆధ్వర్యంలో బేటీ బచావో--బేటీ పడావో కార్యక్రమం ద్వారా బాలికల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. "బాలికను కాపాడుదాం, చదివిద్దాం, ఎదుగుదలకు బాటలు వేద్దాం" అంటూ ఆమె పిలుపునిచ్చారు. రాఖీ వేడుకల్లో చిన్నా రులు, విద్యార్థినులు పరస్పరం రాఖీలు కట్టి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో భరోసా కోఆర్డినేటర్ ఆశ్రిత, కేడర్ ఎనీజ్వో ఆఫీసర్ సతీష్, ఓల్డ్ ఏజ్ హోమ్ కోఆర్డినేటర్ నరేడ్ల స్వామి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన భక్తజనం.. మైసమ్మ సన్నిధిలో సందడి

**- పోతురాజుల విన్యాసాలు.. మహిళల నృత్యాలతో మైసిగండి నుంచి వైభవంగా ఊరేగింపు**

**- అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు.. పాడిపంటలు, సుఖసంతోషాల కోసం ప్రత్యేక పూజలు**







**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కట్ట మైసమ్మ బోనాల మహోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉదయాన్నే అమ్మవారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, యాదగిరి గౌడ్, నరసింహ గౌడ్, రాజేష్ గౌడ్, బాలయ్య గౌడ్, ఆంజనేయులు గౌడ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం మైసిగండి నుంచి మైసమ్మ దేవస్థానం వరకు మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. పోతురాజుల ఆటలు, మహిళల నృత్యాలు, అమ్మవారి వివిధ రూపాల్లో అలంకరించుకున్న భక్తుల సందడితో ర్యాలీ కన్నులపండువగా సాగింది. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుష్కలంగా వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజల కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, పిల్లలు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ ప్రేమ జవహర్‌లాల్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, ఉపసర్పంచ్ హీరాసింగ్ నాయక్, మాజీ ఎంపీపీలు శిరోలి పంతూ, కమిలి మోత్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మాదారం శేఖర్ గౌడ్, రామావత్ తుల్సీరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు. గౌడ సంఘం నాయకులు పాలకుర్ల నరసింహ, యాదగిరి, పుల్లయ్య, శ్రీరాములు, శేషయ్య, బాలయ్య, గణేష్, రాజేష్, మహేష్, ఆంజనేయులు, ధన, రాజు, వెంకటేష్, రమేష్, నరసింహ, రాజు, మధు, దీపావత్ శంకర్ నాయక్, లాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల బంధానికి రంగురంగుల రాఖీలు

**- రక్షాబంధన్ పండుగ సమీపిస్తుండటంతో జోరుగా రాఖీల కొనుగోళ్లు**

**- మహిళలు, యువతులు, చిన్నారులను ఆకట్టుకుంటున్న విభిన్న డిజైన్లు**



**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రక్షాబంధన్ పండుగ సమీపిస్తుండటంతో ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రాఖీల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయి. రంగురంగుల డిజైన్లతో కూడిన వివిధ రకాల రాఖీలను వ్యాపారులు ప్రత్యేకంగా అందుబాటులో ఉంచడంతో కొనుగోలుదారులు ఆసక్తిగా తరలివస్తున్నారు. చిన్నారులను ఆకట్టు కుంటున్న ప్రత్యేక రాఖీలు కార్టూన్ బొమ్మలు, ఆకర్షణీయమైన డిజైన్లు, సంప్రదాయ నమూనాలతో కూడిన రాఖీలు చిన్నారులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. తమ అన్నదమ్ముల కోసం నచ్చిన రాఖీలను ఎంపిక చేసుకునేందుకు చిన్నారులు, యువతులు ఉత్సాహం చూపుతున్నారు. పండుగ సమీపిస్తుండటంతో పెరుగుతున్న కొనుగోళ్లు రక్షాబంధన్ సమీపిస్తున్న కొద్దీ బస్టాండ్ ఆవరణలో రాఖీల కొనుగోళ్లు మరింత ఊపందుకున్నాయి. పండుగ రోజున అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. అన్నాచెల్లెళ్ల ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో నెలకొన్న ఈ రాఖీల సందడి పట్టణంలో పండుగ వాతావరణాన్ని తీసుకువస్తోంది. ప్రయాణికుల సందడి మధ్య రాఖీల మార్కెట్ కళకళలాడుతుండగా, పండుగ సందడి ఆమనగల్లు పట్టణంలో మరింత పెరుగుతోంది.

# లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ నాయకులకు ఘన సన్మానం



**కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ లయన్స్ క్లబ్ నూతనంగా ఎన్నికైన నాయకులను సన్మానిస్తూ వైశ్య భవన్‌లో కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీగా ఎన్నికైన లయన్ బోనగిరి శశి కిరణ్, డైరెక్టర్లుగా ఎన్నికైన లయన్ తుడుపునూరి శివప్రసాద్, లయన్ బుక్క శ్రీనివాస్‌లను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. సభ్యులు వారిని అభినందిస్తూ, క్లబ్ సేవా సంప్రదాయాన్ని కొనసాగిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో లయన్ శివకాంత్ పటేల్, లయన్ బట్టు వినోద్, లయన్ మెతుకు కృష్ణ చైతన్య, లయన్ ముక్క శరత్ కృష్ణ, లయన్ ప్రసాద్ కంభం, లయన్ ఐతా సూరజ్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.స్నేహభావం, నాయకత్వం, సమాజ సేవను బలోపేతం చేయాలనే నూతన నిబద్ధతతో కార్యక్రమం ముగిసింది.

# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**కరీంనగర్ రూరల్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నగునూరు గ్రామంలో రూ.10 లక్షల ఎస్‌జీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ బుధవారం శంకుస్థాపన చేశారు.గ్రామానికి విచ్చేసిన ఆయనను ప్రజలు ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై సాగునీటి, కరెంట్ సమస్యలు, రోడ్ల నిర్మాణంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. తరువాత మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో రాష్ట్రం అభివృద్ధి సాధించిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. రానున్న రెండేళ్లలో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, సర్పంచ్ సాయిల్ల శ్రావణి మహేందర్, ఉప సర్పంచ్ హనుమంతరావు, నాయకులు పాషా, రవితేజ, దిలీప్, భద్రయ్య, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, రంగారెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై మహాధర్నా



**కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా జరిగింది.ఉదయం నుంచే వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధికారులు, పెన్షనర్లు ర్యాలీలుగా తరలివచ్చి ధర్నా చౌక్‌ను నింపారు. "పీఆర్సీ అమలు చేయాలి, పెండింగ్ డీఏలు విడుదల చేయాలి, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి, హెల్త్ స్కీమ్ లోపాలు సవరించాలి" అంటూ నినాదాలు చేశారు.ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులను నిర్లక్ష్యం చేయడం సరికాదని, సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. "పెన్షన్ భిక్ష కాదు--ఉద్యోగుల హక్కు" అని స్పష్టం చేశారు.సెక్రటరీ జనరల్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ కార్యనిర్వహణలో జరిగిన ఈ మహాధర్నాలో ఉపాధ్యాయ సంఘాలు, పెన్షనర్ల సంఘాలు, గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యంగా పాల్గొన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకపోతే రాబోయే రోజుల్లో మరింత ఉధృతమైన ఉద్యమం తప్పదని నాయకులు స్పష్టం చేశారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై సమీక్ష సమావేశం



**కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా పంపిణీని వేగవంతంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, చేయూత పెన్షన్లు, ఎస్ఐఆర్ ప్రక్రియపై సూచనలు చేశారు. కళాభారతి ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక నోటీసు కౌంటర్లను పరిశీలించి, మరిన్ని కౌంటర్లు, హెల్ప్ డెస్క్, మెడికల్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.సెప్టెంబర్ 22 వరకు ప్రత్యేక నోటీసు కౌంటర్లు ఓటర్లకు అందుబాటులో ఉంటాయని, నోటీసులు వచ్చిన వారు ధృవీకరణ పత్రాలతో నిర్ణయించిన తేదీలలో విచారణ పూర్తి చేసుకోవాలని సూచించారు. చేయూత పెన్షన్లకు కొత్త దరఖాస్తులను ఆగస్టు 31 వరకు స్వీకరిస్తామని తెలిపారు.సమీక్షా సమావేశంలో అదనపు కమిషనర్ ఆయాజ్, డిప్యూటీ కమిషనర్లు ఖాధర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, ఈఈ లచ్చిరెడ్డి, ఏఈ రాజేష్, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శక ఓటర్ల జాబితాకై గ్రామసభ నిర్వహణ



**గన్నేరువరం, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా గన్నేరువరం గ్రామంలో గ్రామ సభ జరిగింది.అడిషనల్ కలెక్టర్, మానకొండూర్ నియోజకవర్గ ఈఆర్ఓ సభకు హాజరై ముసాయిదా ఓటర్ల జాబితాను బహిరంగంగా చదివి వినిపించారు. గ్రామస్తులు తమ కుటుంబ సభ్యుల పేరు, వయస్సు, లింగం, చిరునామా, ఫోటో వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.అర్హుల పేర్లు తప్పకుండా నమోదు కావాలని, అనర్హుల పేర్లు కొనసాగకుండా పారదర్శకంగా జాబితాను పరిశీలించాలని అధికారులు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం--6, సవరణలకు ఫారం--8, అభ్యంతరాలకు ఫారం--7 ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని వివరించారు. 01-10-2026 నాటికి 18 ఏళ్లు పూర్తిచేసే యువతను కూడా ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, బి.ఎల్.ఓ సూపర్‌వైజర్ శ్రీనాథ్, సర్పంచ్ లక్ష్మీనర్సు, బి.ఎల్.ఓలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత షూల పంపిణీ



**సుల్తానాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ అండగా నిలుస్తోందని 8వ వార్డు కౌన్సిలర్ చింతల రాజు అన్నారు. అశోక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత షూలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదురోకుండా ప్రభుత్వం చేస్తున్న సహాయం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి



**అమరాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి.సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ ప్రాంతంలో జరిగిన ఉద్యమాల కారణంగా కొందరు యువకులు జీవిత ఖైదీలుగా జైళ్లలో మగ్గుతున్నారని నాయకులు పేర్కొన్నారు. ప్రజల హక్కులు, సంక్షేమం కోసం పోరాడిన వారిని తెలంగాణ ఉద్యమకారులుగా పరిగణించి మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఖైదీల సమస్యలను పరిశీలించి తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆగస్టు 29న ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పౌర హక్కుల సంఘం, కుల నిర్మూలన పోరాట సమితి, ప్రజా ఫ్రంట్, అంబేద్కర్ సంఘం, రాజ్యాంగ పరిరక్షణ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.ఈ ధర్నాలో పెద్ద ఎత్తున పాల్గొని రాజకీయ ఖైదీలకు న్యాయం చేయాలని వారు కోరారు.

# 15 కేసుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి దహనం



**నంద్యాల, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నంద్యాల జిల్లా మాదకద్రవ్య నిర్మూలన కమిటీ ఆధ్వర్యంలో 12 పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 15 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 30.276 గ్రాముల గంజాయిని ఎన్‌డిపీఎస్ చట్ట నిబంధనల ప్రకారం శాస్త్రీయ పద్ధతిలో ధ్వంసం చేశారు.జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ లిమిటెడ్‌లోని నిర్దేశిత మెషినరీలో కాలుష్య నియంత్రణ మండలి సూచనల మేరకు, పర్యావరణానికి హాని కలగకుండా అత్యంత భద్రతా ప్రమాణాలతో గంజాయిని దహనం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ ఎస్. ఖాదర్ బాషా, ఆళ్లగడ్డ డీఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్స్పెక్టర్ రమేష్, సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు, డీడీసీ కమిటీ సభ్యులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# రక్షా బంధన్ ప్రాముఖ్యత ( రక్ష - ఇతివృత్తం)






ప్రక్రియ:- తేనియలు
భారతేతిహాసమున చూడ
శిశుపాలుడి సంహారమునట
గోపాలుడికి చిరుగాయమవగ
ద్రౌపది చీర కొంగు(రక్ష)కట్టెనట (-మహాభారతం)
వామనావతారమున జూడ
బలితొ హరియుండె పాతాళమున
లక్ష్మీ దేవి బలికి రక్ష కట్టి
భర్తను తీసుకెళ్ళె తెలివిన - (భాగవతం)
దేవతలకు రాక్షసులకును
పుష్కరకాలం సమరమాయె
దేవేంద్రుడు నిర్వీర్యుడై
అమరావతిన తలదాచుకొనియె
రాక్షసరాజు అమరావతిని
దిగ్బంధనం చేయ రాగా
శ్రావణ పౌర్ణమిన శచిదేవి
రక్ష కట్టగ విజమొందెగా - (దేవలోకం)
సోదర సోదరీమణులకి
ప్రేమానురాగాలకు ప్రతీక
పతికి ధైర్యాన్నిచ్చేందుకు
సతి కట్టే రక్షకు ప్రతీక

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు
తేనియలు ప్రక్రియ రూపకర్త
రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమకవి పురస్కార గ్రహీత
కరీంనగర్
8019652808

# రాఖీ పౌర్ణమి వేళ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



**హుస్నాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం హుస్నాబాద్ బస్టాండ్ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ఎన్. వెంకన్న తెలిపారు.28 ఆగస్టు శుక్రవారం రోజువారీ బస్సులతో పాటు కరీంనగర్, హుజురాబాద్, సికింద్రాబాద్, జనగాం రూట్లలో అదనపు బస్సులు ఏర్పాటు చేశారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకొని రాఖీ పౌర్ణమిని సంతోషంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు.

# బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన జాన్సన్ నాయక్



**ఖానాపూర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** దస్తూరాబాద్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తోట మల్లయ్య అనారోగ్యంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ గురువారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. మల్లయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ఆయనకు మనోధైర్యం కల్పించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను కోరారు.

# గాయత్రి డిగ్రీ ఓ పీజీ కళాశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**పెద్దపల్లి, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గాయత్రి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, ఉపాధ్యాయులకు రాఖీలు కట్టి "నేను నీకు రక్ష, నువ్వు నాకు రక్ష, మనిద్దరం దేశానికి రక్ష" అనే నినాదంతో శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయురాలు శారద మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల పవిత్ర బంధానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ సోదరభావంతో జీవించాలని సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శారద, ఆమని, రవళి, శ్రీవిద్య, సరస్వతి, లీనతో పాటు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మాలల హక్కుల కోసం చలో సెక్రటేరియట్



**హుస్నాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మాలల హక్కుల సాధన కోసం ఆగస్టు 31న నిర్వహించనున్న చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాతీయ మాల మహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరె కిశోర్ పిలుపునిచ్చారు.కోహెడ అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్లు దానం కాదని, రాజ్యాంగం కల్పించిన హక్కు అని పేర్కొన్నారు. రోస్టర్ విధానంలో సరైన పాయింట్లు కేటాయించకపోతే మాలలకు న్యాయం జరగదని, జీవో 99లోని కేటాయింపులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.20 రోస్టర్ పాయింట్లలో కనీసం రెండు పాయింట్లు మాలలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లలో మాలలకు తగిన ప్రాతినిధ్యం లభించడం లేదని ఆరోపించారు. ఆగస్టు 31లోపు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తలారి నర్సయ్య, మీడియా ఇన్‌చార్జ్ జాల శ్రీనివాస్, దుంద్ర సుమన్, వేరంగి సాయి పరమేష్, బందెల రాజమౌళి, గద్దల రమేష్, గూడ స్వామి, తలారి శంకర్, రాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో 97ను రద్దు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్



**హుస్నాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన జీ.ఓ 97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం ఆర్‌డీఓ కార్యాల యంలో డీఏఓ అరిఫాకు వినతిపత్రం అందజేశారు.విద్యార్థులు, అధ్యాపకులు వ్యతిరేకిస్తున్న ఈ జీ.ఓ వల్ల పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని నాయకులు పేర్కొన్నారు. గతంలో పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో ప్రవేశం పొందేవారని, కానీ కొత్త నిబంధనలతో పరీక్ష రాయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీని తీసుకురావడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే విద్యార్థులకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోకూడదని వారు స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనను అర్థం చేసుకుని వెంటనే జీ.ఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి, పిసర సత్యనారాయణ రావు, అయిలేని గాల్ రెడ్డి, మేకల వికాస్ యాదవ్, నాంపల్లి శంకర్, గుగులోతు తిరుపతి నాయక్, ఇరుగు రమేష్, మాటూరి రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



**హుస్నాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కోహెడ మండల కేంద్రంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్‌కు తెలంగాణ గాయని తేలు విజయ ముందస్తుగా రాఖీ కట్టి రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని, కుటుంబ వ్యవస్థలో మహిళల రక్షణ, సోదరాభిమానం, అనుబంధాలను చాటిచెప్పే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. ప్రతి ఏటా తేలు విజయ తనకు రాఖీ కడుతూ సోదరి బంధాన్ని చా టుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం తేలు విజయ కుటుంబ సభ్యులను సుభాష్ చంద్రబోస్ సన్మానించి అభినందించారు. వేడుకల్లో కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## క్రీడా రంగంలో అవకాశాలపై యువతకు అవగాహన

సిద్దిపేట, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : యువతలో క్రీడా స్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యంగా గురువారం సిద్దిపేటలో 'ఖేల్ ఇండియా డైలాగ్--ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్' కార్యక్రమం జరిగింది.తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆగస్టు 27న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 1,600 ప్రాంతాల్లో 8 లక్షలకుపైగా యువతతో వర్చువల్‌గా సంభాషించినట్లు తెలిపారు. గత 12 ఏళ్లలో క్రీడా రంగంలో వచ్చిన మార్పులు, మౌలిక వసతులు, అవకాశాలపై యువతకు అవగాహన కల్పించారని చెప్పారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సునీత, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సిహెచ్. పుష్పలత, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని బీజేపీ, బీజేవైఎం నిరసన



పెద్దపల్లి, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది.జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి సూచనలతో బీజేవైఎం నాయకుడు రామగిరి అఖిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో బీజేపీ జిల్లా కార్యదర్శి శివగారి సతీష్‌కుమార్, రామగిరి అఖిల్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించిన బీజేవైఎం నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. అయినప్పటికీ నాయకులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ నిరసనను కొనసాగించారు. కార్యక్రమంలో రాజం మహంత కృష్ణ, రెండ్ల వేణు, ఉషణ అన్వేష్, భూషణవేణు, గుడ్ల సతీష్, మధుకరణ్, మంతెన కృష్ణ, కాసనగొట్టు విజయ్, శివసాయి, వీరేశ్ గౌడ్, మహేష్, గణేష్, స్నేహిత్, పోగుల రాజుతో పాటు బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చేపల పెంపకంపై శిక్షణ



కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): వ్యవసాయ సాంకేతిక నిర్వహణ శిక్షణ సంస్థ (ఎటిఎంఏ) ఆధ్వర్యంలో ఎల్ఎమ్‌డీ కాలనీలోని మత్స్య విత్తన కేంద్రంలో చేపల పెంపకంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది.రైతులకు చేపల పెంపక మెలకువలు, యజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. సహకార సంఘాల సభ్యులు, మత్స్య రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త కె. ప్రభాకర్, జిల్లా మత్స్యశాఖ అధికారి డా. విజయ భారతి, ఎటిఎంఏ పీడీ బి. చత్రు, బిటిఎం బి. స్రవంతి, ఎఫ్‌డిడి రాంధన్, ఎఫ్ఎఫ్ఓ అశోక్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్యతో పాటు బొమ్మకల్, బోడిగే వీరేశం, మల్లేశం, వెంకటరమణ, నీరటి సంపత్, బొగ్గుల సంపత్, మారుతి, ఉదయ్, సతీష్, రవి రాజశేఖర్, రాగుల బాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో రాఖీ వేడుకలు



హుస్నాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా సిద్దిపేట కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ రక్షా సూత్రానికి పురాణకాలం నుండి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అది అన్నాచెల్లెళ్ల ప్రేమ, అనుబంధానికి ప్రతీకగా మారిందని తెలిపారు. ప్రధానాచార్య శ్రీలత మాట్లాడుతూ రాఖీ కేవలం ఒక దారం కాదు, అది ప్రేమ, నమ్మకం, రక్షణ, బాధ్యతలకు గుర్తు అని పేర్కొన్నారు.విద్యార్థులు "నేను నీకు రక్ష -- నీవు నాకు రక్ష -- మనిద్దరం దేశానికి రక్ష" అనే నినాదాలతో ప్రభుత్వ కార్యాలయ సిబ్బందికి రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు.కార్యక్రమంలో హుస్నాబాద్ కాండకార్యవహ ఇటుకల రాజశేఖర్, మాతాజీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిశు మందిర్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ముందస్తు రాఖీ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి యజ్ఞం, రాఖీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వేద మంత్రోచ్ఛారణల మధ్య హవన కార్యక్రమంలో పాల్గొన్నారు. రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ప్రేమ, అనుబంధానికి ప్రతీక అని ఉపాధ్యాయులు వివరించారు. ప్రధానాచార్యుడు మోర రణధీర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సంస్కారం, దేశభక్తి, సోదరభావం పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ఉద్దేశమని తెలిపారు. యజ్ఞం అనంతరం విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పాఠశాల ఆవరణం భక్తి, ఆనందోత్సాహాలతో కళకళలాడింది.కార్యక్రమంలో కార్యదర్శి కోల అన్నారెడ్డి, ఎలగందుల సత్యనారాయణ, డా. ఎలగందుల శ్రీనివాస్, కొణిజర్ల మహేష్, శిరీష, పులాల శ్యామ్, అల్లాడి ఆనంద్ కుమార్, ముసుకుల విద్యాసాగర్ రెడ్డి, పండుగ నాగరాజు, టి. రాజేశ్వర్ రావు, అప్పిడి వకుళా దేవి తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక సంఘంలో సాధారణ సమావేశం నిర్వహణ



హుస్నాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ దండి లక్ష్మి అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. కమిషనర్ టీ. మల్లికార్జున్, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మతో పాటు కౌన్సిలర్లు పాల్గొన్నారు.సీజనల్ వ్యాధుల నివారణ చర్యల కోసం కెమికల్స్, గడ్డి మందు, ఆయిల్ బాల్స్, గాంబుషియా చేపలు కొనుగోలు చేయడానికి రూ.99 వేల వ్యయం, వినాయక--దేవి నిమజ్జన ఏర్పాట్లకు రూ.2 లక్షలు, బతుకమ్మ--దసరా పండుగల ఏర్పాట్లకు రూ.15 లక్షలు, నీటి సరఫరా మోటర్లు మరమ్మతులకు రూ.5 లక్షలు, వైకుంఠదామంలో ప్లంబింగ్--లైటింగ్ పనులకు రూ.2.5 లక్షలు కేటాయించారు.అనధికార హోర్డింగులపై రూ.2 లక్షల జరిమానా విధించడం, రామవరం రోడ్--కొండ లక్ష్మణ్ బాపూజీ జంక్షన్ రోడ్డు వెడల్పు ప్రతిపాదనకు సర్వే ఏజెన్సీకి రూ.57,600 చెల్లించడం, వర్షాల కారణంగా రోడ్ల గుంతలు పూడ్చుడానికి రూ.3 లక్షలు కేటాయించడం వంటి అంశాలు ఆమోదం పొందాయి.మొత్తం 29 అంశాలలో 27 అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బురుగు లత, కొండ రజిత, తిరుపతి, బొలిశెట్టి రాజు, సంపత్, సతీష్ కుమార్, మంజుల, వరప్రసాద్, రమేష్, శ్రీనివాస్, కిరణ్ ప్రసాద్, రవీందర్, సుప్రజ, స్వరూప, శోభన్ బాబు, కో-ఆప్షన్ సభ్యులు పున్న లావణ్య, సరోజన, మహమ్మద్ హసన్, గ్లోరీనా, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన వైద్య సిబ్బంది




నందికొట్కూరు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఏపీ మెడికల్ అండ్ హెల్త్ పారామెడికల్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పారామెడికల్ సిబ్బంది గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు .నందికొట్కూరులో వైద్య సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలిపారు. 15 రోజుల్లో న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. స్పందన లేకపోతే మెడికల్ జేఏసీ పిలుపు మేరకు సమ్మెకు సిద్ధమని హెచ్చరించారు.జేఏసీ లేఖను హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఇప్పటికే అందజేసినట్లు, 45 రోజుల గడువు ఇచ్చినా స్పందన రాకపోవడంతో స్ట్రైక్ నోటీసు సమర్పించామని వారు తెలిపారు.ప్రజలకు, రోగులకు ఇబ్బంది కలగకుండా సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే సమ్మె తప్పదని వైద్య సిబ్బంది స్పష్టం చేశారు.కార్యక్రమంలో నందికొట్కూరు సామాజిక వైద్యశాల డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికై పీజీఆర్ఎస్



నందికొట్కూరు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : జిల్లా పరిపాలన ప్రజలకు చేరువ కావడం, స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడం లక్ష్యంగా చేపట్టిన "వన్ మంత్ -- ఫోర్ విజిట్" కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28న పాములపాడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహించనున్నారు.జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా, నందికొట్కూరు ఎమ్మెల్యే జి. జయసూర్యతో కలిసి ప్రజల వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అర్జీలను సంబంధిత శాఖల ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతారని కలెక్టర్ తెలిపారు. జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల సమస్యలను నేరుగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. పాముల పాడు, కొత్తపల్లి మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ డిమాండ్



ఆత్మకూరు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రైతులను మోసం చేసిన వీఆర్వో అబ్దుల్లాపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. వెలుగోడు మండలంలో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. వీఆర్వో అబ్దుల్లా రైతు షేక్ హుస్సేన్ మియా భార్య మహబూబ్ బి పేరుతో భూమి అగ్రిమెంట్ రాసి డబ్బులు తీసుకున్నప్పటికీ, తరువాత రికార్డులను తొలగించి మోసం చేశారని నాయకులు ఆరోపించారు.జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటు చేసి రైతుకు న్యాయం చేయాలని వారు కోరారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పార్టీ అండగా ఉంటూ పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం నాయకులు, బాధిత రైతు హుస్సేన్ మియా దంపతులు పాల్గొన్నారు.

## వీఆర్వో కుటుంబానికి న్యాయం చేయాలి



నందికొట్కూరు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : విధి నిర్వహణలో మృతి చెందిన వీఆర్వో హరిశ్చంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రైతు కార్మిక సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రాతకోట గ్రామంలో హరిశ్చంద్ర కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, కుమార్తె మానసిక అనారోగ్యంతో బాధపడుతోందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పిఎఫ్, ఇఎస్ఐ ప్రయోజనాలను వెంటనే అందించడంతో పాటు కుమారునికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం కల్పించాలని కోరారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు గుంపుల త్యాగరాజు, సామన్న, రిటైర్డ్ వీఆర్వో శేషగిరిరావు, కుటుంబ సభ్యులు తలారి పద్మావతమ్మ, టీ. దివ్య, తలారి హరీష్, టీ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# అన్నా చెల్లెల రాఖీ బంధం



అందరినీ ఒక్కటిగా చేసే
రక్షాబంధన్
అవనిలో ఆడపిల్లలకు
గౌరవాన్ని ఇచ్చే పండుగ
అన్నాతమ్ముళ్లకు
అనుబంధానికి వారధిగా
రక్షాబంధన్
అన్న తమ్ముళ్లు అన్నిట్లో
విజయం గా ఉండాలని కోరే
అక్కచెల్లలు!!!
అందమైన అనుబంధం
అంతులేని అనురాగం
అన్నాచెల్లెల బంధం
రక్షాబంధన్!!!
నీవు నాకు రక్ష
నేను నీకు రక్ష
మనమిద్దరం కలిసి దేశానికి
రక్షణగా ఉందాం
రక్తసంబంధం రాఖీ పండుగ
అన్నా చెల్లెల అనుబంధం రాఖీ పండుగ
ఆత్మీయతను పంచే రాఖీ పండుగ
రాఖీ కట్టి రక్షణగా ఉండాలని కోరే చెల్లె!!!
ఆగస్టు నెలలో వచ్చే ఆనందమైన పండుగ
ఆడపిల్లలకు ఆనందానిచ్చే పండుగ
అన్నా చెల్లెల్ని ఒక్కటి చేసే రక్షాబంధన్
మమత అనురాగాలను పంచే పండుగ!!!
రక్షాబంధన్ శుభాకాంక్షలు!!!

రచన :-
దేవులపల్లి రమేశ్,(కవి, రచయిత )
కలం : వామిక శ్రీ వర్ష
నంగునూర్, సిద్దిపేట జిల్లా
చరవాణి
:9963701294

## మాలగోని హనుమంతు ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



అమ్రాబాద్, ఆగస్టు 26 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అమ్రాబాద్ మండలం తిరుమలాపూర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలగోని హనుమంతు, మాజీ ఎంపీటీసీ చిక్కుడు కేశవులు, వార్డు సభ్యులు సాయిలు, రాజు, సాయి నిరంజన్, వెంకటేష్, డీలర్ నాయక్ సర్దార్, అధికారులు, సర్పంచ్, ఉప సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.

## 16 గదుల నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే



పాణ్యం, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 16 గదుల పనులకు పాణ్యం ఎమ్మెల్యే, టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు గౌరు చరితా రెడ్డి, టీటీడీ పాలకమండలి సభ్యుడు మల్లెల రాజశేఖర్, ఏపీ ఈడబ్ల్యూ ఐడీసీ రాష్ట్ర డైరెక్టర్ జీ. నాగముని కలిసి భూమిపూజ చేశారు.తరువాత బుగ్గ రామేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రూ.45 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు అందుతున్న సౌకర్యాలపై వారు వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ నాగిరెడ్డి, హుస్సేనాపురం లక్ష్మణరావు, సుధాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, సంజీవ రామ్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ఇతర గ్రామాల నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.?

## రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని నిరసన



పాములపాడు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని డీలర్ల సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు జి. నాగభూషణరావు, కార్యదర్శి ఎం.వి. సుధాకర్, ట్రెజరర్ ఎస్.టి. హుస్సేన్ సాహెబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో డీలర్లు పాల్గొన్నారు. అనంతరం వారు తహసీల్దార్ జి. సుభద్రమ్మకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఇస్తున్న కమిషన్‌ను రూపాయి నుంచి మూడు రూపాయలకు పెంచాలని, బియ్యం బస్తాలను కాటపై పెట్టే విధానాన్ని తొలగించాలని, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్దే తూకం వేసి స్కానింగ్ అనంతరం పంపించాలని వారు డిమాండ్ చేశారు.రేషన్ షాపుల్లో స్కానింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం స్మార్ట్ మొబైల్ ఫోన్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కె. హైమావతి, బి. చంద్రకళ, ఎం. శేఖర్, ఎం. సునీల్, పి. గోపాలరెడ్డి, ఈ. మాణిక్యరావు, ఎస్. సంజన్న, ఎస్. తిరుపాలు, టి. శేషపని శర్మ, బి. సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో శక్తి యాప్ అవగాహన సదస్సు



నందికొట్కూరు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ సూచనలతో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో శక్తి యాప్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఎస్సై మణికంఠ ఆధ్వర్యంలో శక్తి టీం ఏఎస్ఐ ఎస్. ఖాదర్ బాషా, పీసీ రసూల్ గ్రామ మహిళలు, ప్రజలకు శక్తి యాప్ వినియోగంపై వివరించారు. శక్తి వాట్సాప్ నంబర్ 7993485111, అత్యవసర నంబర్లు 112, 100, 181, 1098, 1930 ప్రాముఖ్యతను తెలియజేశారు.పిల్లల భద్రత, అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ మొబైల్‌లో శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి టీం సభ్యులు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## పెసరవాయి గ్రామాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ సునీల్ షోరాణ్




గడివేముల, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ గురువారం పెసరవాయి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ఫ్యాక్షన్ పోలీస్ పికెట్‌ను తనిఖీ చేసి ప్రస్తుత శాంతిభద్రతల పరిస్థితి, ప్రజల జీవన విధానం, స్థానిక సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు.పికెట్ సిబ్బందితో మాట్లాడి విధుల నిర్వహణపై ఆరా తీశారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండి గ్రామంలో జరిగే ప్రతి పరిణామాన్ని గమనించాలని, అనుమానాస్పద కదలికలు వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.ప్రజలకు భద్రతా భావన కల్పించేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర నిఘా, పటిష్ట బందోబస్తు, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించాలని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో పాణ్యం ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శుక్రవారం, ఆగస్టు 28, 2026



## మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా రాఖీ వేడుకలు




కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులు, అధ్యాపకులు పరస్పరం రాఖీలు కట్టుకుని పండుగ విశిష్టతను చాటుకున్నారు. రాఖీ అనేది ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, రక్షణ, సామాజిక బాధ్యతలకు ప్రతీక అని విభాగం కోఆర్డినేటర్ డా. బి. రజని దేవి పేర్కొన్నారు. మహిళల భద్రత, స్వావలంబన, సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## గ్రామ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్



గోదావరిఖని, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : అంతర్గాం గ్రామంలో జరిగిన గ్రామ సభలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ఫేజ్--2లో ఓటరు జాబితా పరిశీలనకు ప్రజలు సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని, వివరాల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు. తరువాత అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సింగరేణి అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహణ



రామగుండం, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గురువారం క్యాంప్ కార్యాలయంలో సింగరేణి సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ సూర్యనారాయణతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి కార్యకలాపాల పురోగతి, అభివృద్ధి పనులు, కార్మికులు--ప్రజలకు సంబంధించిన సమస్యలు, భద్రతా చర్యలు, పెండింగ్ పనులపై విస్తృతంగా చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు, భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రామగుండం సమగ్ర అభివృద్ధికి సింగరేణి సహకారం మరింత పెరగాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, ఆర్‌జీ--1, ఆర్‌జీ--2 జనరల్ మేనేజర్లు, ఏసీపీ, ఎంఆర్‌ఓతో పాటు సింగరేణి మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రజా సంక్షేమం, ప్రాంత అభివృద్ధే ప్రధాన లక్ష్యమని, అందరూ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

## ప్రారంభంకానున్న సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్



మంచిర్యాల, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల మెడికల్ గోడౌన్ ప్రాంగణంలో నిర్మించిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను ఈనెల 31న ప్రారంభించనున్నారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో నిర్మించిన ఈ ఆధునిక కిచెన్ ద్వారా జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని 17 మండలాల 691 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 42,450 మంది విద్యార్థులకు, అలాగే 13 జూనియర్ కాలేజీల్లో చదువుతున్న 6,654 మంది విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించనున్నారు. విద్యార్థులు ఆకలితో పాఠశాలకు వెళ్లకుండా, ఆరోగ్యకరమైన అల్పాహారంతో ఉత్సాహంగా చదువుకునేలా ఈ కార్యక్రమం దోహదపడనుంది.

## ఆధునిక సాంకేతికతతో భూముల రీ--సర్వే



గన్నేరువరం, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : తెలంగాణ ప్రభుత్వం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రాష్ట్రవ్యాప్తంగా రీ--సర్వే చేపడుతోంది. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం యస్వడా గ్రామంలో గ్రామ సభ జరిగింది. అడిషనల్ కలెక్టర్ డా. డి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రీ--సర్వే ద్వారా ఖచ్చితమైన జియో--రిఫరెన్స్‌డ్ కాడస్ట్రల్ మ్యాపులు, శాశ్వత డిజిటల్ భూ రికార్డులు సిద్ధం చేసి రైతులకు న్యాయం చేయడం లక్ష్యమని తెలిపారు. సర్వే అనంతరం రైతులకు శాటిలైట్ మ్యాపులు అందజేయనున్నట్లు చెప్పారు. రైతులు రీ--సర్వేకు సహకరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ కిషన్ రావు, తహసీల్దార్ నరేందర్, సర్పంచ్ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై వార్డు సభలు



సుల్తానాబాద్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) : సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 7, 8, 11వ వార్డుల్లో నిర్వహించిన వార్డు సభలు విజయవంతంగా ముగిశాయి. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో భాగంగా ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. 7వ వార్డులో కౌన్సిలర్ ఉట్ల వరప్రదీప్, 11వ వార్డులో కౌన్సిలర్ కల్వల శంకరమ్మ--ఓదేలు, 8వ వార్డులో కౌన్సిలర్ చింతల రాజు సభల్లో పాల్గొని కొత్త ఓట్ల నమోదు, పేర్ల సవరణ, డబుల్ ఓట్ల తొలగింపు వంటి అంశాలను వివరించారు. సభల్లో ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన పొందారు. ప్రజల భాగస్వామ్యంతో వార్డు సభలు విజయవంతంగా ముగిశాయి.

## వార్డుల సమస్యల పరిష్కారానికి చైర్మన్ పర్యటన

**- 11, 15వ వార్డుల్లో పర్యటించి సమస్యలపై ఆరా..**
**మార్కండేయ ఆలయంలో రక్షాబంధన్ ఏర్పాట్ల పరిశీలన**



ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్ గురువారం 11, 15వ వార్డుల్లో పర్యటించారు. కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు ఎంగలి భాగ్యమ్మ రఘు, సునీత ప్రశాంత్ నాయక్‌లతో కలిసి వార్డుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ పత్య నాయక్ సూచించారు.

**- మార్కండేయ ఆలయంలో రక్షాబంధన్ ఏర్పాట్లు**
**- పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి**

అనంతరం ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ మార్కండేయ ఆలయంలో శుక్రవారం జరగనున్న రక్షాబంధన్ కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించారు. పద్మశాలి సంఘం నాయకులు అప్పం శీను, కౌన్సిలర్ ఎంగలి భాగ్యమ్మ రఘు, మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించి మొక్కలు, పరిసరాలను శుభ్రం చేయించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్యంతో పాటు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

## రాఖీతో బంధం.. సమాజ రక్షణకు స్ఫూర్తి

**- విద్యార్థినుల రక్షాబంధన్ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు**





ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆమనగల్లు శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆమనగల్లు ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పోలీసు అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. రాఖీ కేవలం ఒక దారం కాదని, ఆప్యాయత, నమ్మకం, పరస్పర రక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ ఒకరినొకరు గౌరవించుకుంటూ మహిళలు, బాలికల భద్రతకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రక్షాబంధన్ సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంపొందించేలా ఏబీవీపీ నిర్వహించిన కార్యక్రమం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, ఏబీవీపీ ఆమనగల్లు నగర కార్యదర్శి చెన్నంశెట్టి మల్లేష్, గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సభ్యులు పురుగుల శివ, ఏబీవీపీ నగర ఉపాధ్యక్షులు నేనేవత్ సుమన్ నాయక్, అఖిల్ నాయక్, చెర్రీ రాకేష్, మణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాపై లింగరావుపల్లిలో గ్రామసభ

**- ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై అవగాహన.. పాల్గొన్న బీఎల్ఏలు, బీఎల్ఓలు, ఓటర్లు**



ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఎన్నికల కమిషన్ చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ రెండో దశకు సంబంధించి తలకొండపల్లి మండలం లింగరావుపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ, అర్హులైన ఓటర్ల వివరాల నమోదు, జాబితాలోని తప్పుల సవరణ తదితర అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడడంతో పాటు, తప్పుగా నమోదైన వివరాలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్లందరూ భాగస్వాములై తమ వివరాలను పరిశీలించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ భూత్కూరి వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, వార్డు సభ్యులు శివలింగం, శేఖర్, బూత్ నంబర్--17 బూత్ స్థాయి ఏజెంట్ భాస్కర్‌రెడ్డి, బూత్ నంబర్--16 బూత్ స్థాయి ఏజెంట్ ఎండి. రబ్బానీ, బూత్ స్థాయి అధికారులు పద్మమ్మ, మల్లమ్మ, గ్రామ నాయకులు, ఓటర్లు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టు భూసేకరణపై ఎమ్మెల్యే గళం

**- గోకారం, ఎర్రవల్లి గ్రామాల రైతుల భూములు, ఇళ్లను కాపాడేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించాలని విజ్ఞప్తి**



ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్)పై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులతో గురువారం రాష్ట్ర సచివాలయంలో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నియోజకవర్గంలోని గోకారం, ఎర్రవల్లి గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న భూసేకరణ సమస్యను రాష్ట్ర మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. డిండి ప్రాజెక్టు కారణంగా చారకొండ మండలం గోకారం గ్రామ రైతులు వ్యవసాయ భూములు కోల్పోయే పరిస్థితి ఉందని, ఎర్రవల్లి గ్రామపంచాయతీ, తాండ ప్రజలు భూములు, ఇళ్లను కోల్పోయే ముప్పు ఏర్పడిందని ఎమ్మెల్యే వివరించారు. నల్గొండ ప్రాంతానికి సాగునీరు అందించే లక్ష్యంతో చేపడుతున్న ప్రాజెక్టు కారణంగా కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు తమ విలువైన వ్యవసాయ భూములు, నివాసాలను కోల్పోవడం సమంజసం కాదని కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణం అనివార్యమైనప్పటికీ రైతులు, గ్రామాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు. ప్రాజెక్టు రూపకల్పన, ఎత్తు, సామర్థ్యానికి సంబంధించి అవసరమైన సాంకేతిక మార్పులను పరిశీలించి, సాధ్యమైనంత మేర భూసేకరణను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల జీవనోపాధి, వ్యవసాయ భూములు, గ్రామాల ఉనికిని పరిరక్షించేందుకు అధికారులు సాంకేతికంగా అన్ని సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సమావేశంలో చర్చించారు. భూసేకరణ వల్ల ప్రజలకు కలిగే నష్టాన్ని పూర్తిగా నివారించేందుకు లేదా సాధ్యమైనంత మేర తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేయూతకు చివరి గడువు 31

**- అర్హులైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి**
**- మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి**




ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత సోషల్ సెక్యూరిటీ పెన్షన్ పథకం (ఫేజ్--1) కింద కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 31వ తేదీ చివరి గడువుగా ఉందని ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా వెంటనే మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని ఆయన కోరారు. ఈ పథకం కింద ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హిమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. గతంలోనే దరఖాస్తు చేసిన వారు కూడా తమ దరఖాస్తులతో పాటు అవసరమైన పత్రాలన్నీ జత చేశారో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఏవైనా ధ్రువీకరణ పత్రాలు పెండింగ్‌లో ఉంటే వెంటనే అందజేయాలని సూచించారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన వారందరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకుని ఆగస్టు 31లోగా దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

## ఓటరు జాబితా ప్రక్షాళనకు మోగిన ‘వార్డు సభల’ నగారా!

**- ఆమనగల్లులో 19 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ.. సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలకు అవకాశం**



ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్--2026) కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా, 83--కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆమనగల్లు మున్సిపాలిటీలో గురువారం 19 పోలింగ్ కేంద్రాల్లో వార్డు సభలను విజయవంతంగా నిర్వహించారు. స్థానిక ఓటర్లు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు, స్థానిక కౌన్సిలర్లు చురుకుగా పాల్గొని ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై చర్చించారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించడంతో పాటు, వివిధ కారణాల వల్ల జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన భారతీయ పౌరులను గుర్తించి వారి వివరాలను నిర్ధారించారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం--6, ఓటరు వివరాల సవరణ కోసం ఫారం--8, అనర్హులైన ఓటర్ల తొలగింపు కోసం ఫారం--7కు సంబంధించిన ప్రక్రియపై విస్తృత అవగాహన కల్పించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, ధ్రువీకరణకు సెప్టెంబర్ 16వ తేదీ వరకు గడువు ఉందని అధికారులు తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, సమర్పించాల్సిన పత్రాలపై కూడా సభల్లో వివరించారు. ఓటరు వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించిన వారికి బూత్ స్థాయి అధికారులు నోటీసులు అందజేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, పారదర్శకమైన, తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజలందరూ సహకరించాలని ఏఈఆర్ఓ, ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శుక్రవారం, ఆగస్టు 28, 2026


# తీజ్ వేడుకల్లో ఉప్పొంగిన బంజారా ఆత్మగౌరవం

**- గానుగుమర్ల తండాలో ఘనంగా ముగింపు సంబరాలు..**
**మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, దశరథ్ నాయక్ సందడి**



**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కడ్తాల్ మండలం గానుగుమర్ల తండాలో బంజారాల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే తీజ్ ఉత్సవాల ముగింపు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మాజీ జడ్పీటీసీ, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్థానిక సర్పంచ్ సేవ్య నాయక్, వార్డు సభ్యుడు శీను నాయక్ ఆధ్వర్యంలో వారికి బంజారా సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ మేరమ్మ దేవతల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండా యువతులు సంప్రదాయ దుస్తులు, ఆభరణాలు ధరించి తీజ్ బుట్టలతో నృత్యాలు చేయగా, జైపాల్ యాదవ్, దశరథ్ నాయక్ వారితో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రకృతిని దైవంగా భావించే గిరిజనుల జీవన విధానం అందరికీ ఆదర్శమన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగను నిర్వహించడం బంజారా సంస్కృతి వైభవానికి నిదర్శనమన్నారు. గిరిజనుల ఆత్మగౌరవ పరిరక్షణ, హక్కుల సాధనకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. దశరథ్ నాయక్ మాట్లాడుతూ ఆధునిక కాలంలోనూ బంజారా సంస్కృతీ సంప్రదాయాలను సజీవంగా కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందిస్తున్న తండా ప్రజలను అభినందించారు. తీజ్ ఉత్సవాలు బంజారాల ఐక్యత, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అనంతరం తండా పెద్దలు, గిరిజన మేధావులు జైపాల్ యాదవ్, దశరథ్ నాయక్‌లను బంజారా సంప్రదాయ పద్ధతిలో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, తండా పెద్దలు, యువతీ యువకులు, కడ్తాల్ మండల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చీపునుంతలలో వెలుగుల బాట


**- కమాన్ నుంచి గ్రామం వరకు శాశ్వత లైటింగ్ ఏర్పాటు**



**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చీపునుంతల గ్రామ పంచాయతీలో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ సర్పంచ్ గుజ్జుల లక్ష్మమ్మ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గురువారం కమాన్ (మెయిన్ రోడ్) నుంచి గ్రామం వరకు నిరంతరంగా వెలుగులు ఉండేలా శాశ్వత లైటింగ్ ఏర్పాటు పనులను చేపట్టారు. ప్రధాన రహదారిపై పూర్తి స్థాయిలో లైటింగ్ సౌకర్యం కల్పించడంతో రాత్రి వేళల్లో గ్రామస్తులు, వాహనదారులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయాల్లో రహదారిపై చీకటి సమస్య తొలగడంతో ప్రమాదాల నివారణకు, ప్రజల భద్రతకు దోహదపడనుంది. గ్రామానికి వచ్చే ప్రజలు, విద్యార్థులు, వాహనదారులకు ఈ లైటింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని శాశ్వత లైటింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామానికి మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడానికి నిరంతరం కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

# అంధత్వ నివారణకు లయన్స్ విజన్ సేవలు

**- ఆగస్టు 30న కంటి ఆసుపత్రులు, విజన్ సెంటర్ల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం**



**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సమాజంలో అంధత్వాన్ని నివారించి, దృష్టి లోపాలతో బాధపడుతున్న వారికి మెరుగైన నేత్ర వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ డిస్ట్రిక్ట్--320 పరిధిలోని కంటి ఆసుపత్రులు, విజన్ సెంటర్ల సేవలను మరింత విస్తృతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు మల్టిపుల్ డిస్ట్రిక్ట్ విజన్ కోఆర్డినేటర్ లయన్ జి. చెన్నకిషన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లోని భవర్‌లాల్ జైన్ ఆడిటోరియంలో కంటి ఆసుపత్రులు, విజన్ సెంటర్ల చైర్‌పర్సన్లు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఆయా సంస్థల సేవా కార్యక్రమాలు, సాధించిన ప్రగతిపై సమీక్షించడంతో పాటు నేత్ర వైద్య సేవల్లో ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ప్రతి సంస్థ తమ సేవా కార్యక్రమాలు, ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు. ఉత్తమ సేవా విధానాలను పరస్పరం పంచుకుని, అంధత్వ నివారణకు సమష్టిగా కృషి చేయడమే ఈ సమావేశ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ ఎంగలి బాలకృష్ణ, కోశాధికారి లయన్ గంప శ్రీను, డిస్ట్రిక్ట్ చైర్మన్లు, పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

# తప్పుల్లేని ఓటరు జాబితా రూపకల్పనే ఎస్ఐఆర్ లక్ష్యం: జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఓటరు జాబితాలోని చిన్న చిన్న లోపాలను సరిచేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదై ఉండేలా స్పష్టమైన, ఖచ్చితమైన జాబితాను రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు.

బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం వెన్నిచర్ల గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్లతో నిర్వహించిన బీఎల్వో స్థాయి హియరింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హియరింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించి, ఒక ఓటరు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి ప్రక్రియను సమీక్షించారు. గ్రామంలోని మూడు పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 3,010 మంది ఓటర్లు ఉండగా, వివరాల సవరణ కోసం 43 మందికి మాత్రమే నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇందుకోసం నిర్వహించిన గ్రామసభకు నోటీసులు పొందిన 43 మంది ఓటర్లు హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమైన పత్రం అని పేర్కొన్నారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా అనవసరంగా తొలగిపోకూడదని, అదే సమయంలో అనర్హులు లేదా తప్పుగా నమోదైన వివరాలు కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ప్రతి ఓటరికి తన వివరణ ఇచ్చుకునే అవకాశం కల్పించాలని, వారు సమర్పించే ఆధారాలను నిబంధనల ప్రకారం పరిశీలించిన తరువాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. హియరింగ్ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి మరియు నిబంధనల అమలు ప్రధానంగా ఉండాలని స్పష్టం చేశారు.

ఓటర్ల పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాల్లో లోపాలు ఉంటే సంబంధిత ఆధారాలతో సరిచేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న హియరింగ్ కార్యక్రమాల ఉద్దేశాన్ని ప్రజలకు స్పష్టంగా వివరించి, ఎలాంటి అపోహలకు తావు లేకుండా చర్యలు కొనసాగించాలని అధికారులకు సూచించారు. అనంతరం వెన్నిచర్ల గ్రామంలోని చెరువును ప్రస్తావిస్తూ, రైతులు మంచి పంటలు పండించి అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. గ్రామానికి అవసరమైన మీ సేవా కేంద్రాన్ని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్, ఎన్నికల అధికారులు, బీఎల్వోలు, ఎన్నికల సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేసిన సర్పంచ్ రెంటాల కృష్ణ



**కురవి, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని కురవి మండలం నల్లెల్ల గ్రామంలో ప్రారంభించారు. నల్లెల్ల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రెంటాల కృష్ణ, ఉపసర్పంచ్ నిమ్మలగంటి కృష్ణమూర్తి, వార్డు సభ్యులతో కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రెంటాల కృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో సంప్రదాయ రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ రేషన్ కార్డులు కీలకంగా మారనున్నాయని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, కారోబార్, బిల్వోలు, రేషన్ డీలర్లు, యువజన సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




**నాగర్‌కర్నూల్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో లభించే స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.

గురువారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలంలోని వెన్నచర్ల, నక్కలపల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా వెన్నచర్ల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వైద్యులు మరియు సిబ్బంది హాజరు, మందుల నిల్వలు, చికిత్స విధానం, ప్రసూతి సేవలు, అత్యవసర వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో వైద్యం అందించాలని, వైద్య సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ సేవాభావంతో పనిచేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, ఎంతమందికి ఓపీ సేవలు అందుతున్నాయి, ఎన్ని రక్త నమూనాలు సేకరిస్తున్నారనే వివరాలను కలెక్టర్ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని ప్రసవ గది, ప్రయోగశాలను పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. తదుపరి నక్కలపల్లి గ్రామంలో నిర్వహించిన ఎస్ఐఆర్ గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి చెందిన రైతు బోలె ఈశ్వరయ్య పొలంలో వి.బి.జీ. రాంజీ పథకం కింద నిర్మించనున్న ఫారం పాండ్ పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం, పంటలకు అవసరమైన నీటిని అందుబాటులో ఉంచడంలో ఫారం పాండ్లు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న నీటి సంరక్షణ కార్యక్రమాలు ఆశించిన ఫలితాలు ఇవ్వాలంటే పనులను నాణ్యతతో పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజాధనం సద్వినియోగం అయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు నేరుగా చేరేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బన్సీలాల్, తహసీల్దార్, గ్రామ సర్పంచ్, సంబంధిత శాఖల అధికారులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# తమ్మడపల్లిలో సాటిలైట్ రోవర్‌తో భూ రీ-సర్వే



**మర్రిగూడ, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భూ రికార్డుల నవీకరణ, భూముల సరిహద్దుల శాస్త్రీయ నిర్ధారణలో భాగంగా మర్రిగూడ మండలం తమ్మడపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సాటిలైట్ రోవర్ సాంకేతిక పరిజ్ఞానంతో భూ రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. చండూరు ఆర్డీవో వందనపు శ్రీదేవి, మర్రిగూడ మండల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కార్యక్రమానికి హాజరై రీ-సర్వే ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వ, అటవీ, ఇనాం, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్ భూముల రీ-సర్వేకు సంబంధించి రైతులు, గ్రామస్తులకు అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలో భూ పట్టాల ఆధునీకరణ, రికార్డుల నవీకరణకు రైతులు, గ్రామస్తులు సహకరించాలని కోరారు. ప్రతి రైతుకు సంబంధించిన భూమిని శాస్త్రీయ పద్ధతిలో సర్వే చేసి, ల్యాండ్ పార్సెల్ మ్యాప్ (ఎల్‌పీఎం) రూపొందించి ప్రత్యేక నంబర్ కేటాయిస్తామని తెలిపారు. భూముల సరిహద్దులు, రికార్డుల్లో స్పష్టత తీసుకురావడమే రీ-సర్వే ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో తమ్మడపల్లి గ్రామ సర్పంచ్ వెంకటేష్, ఉపసర్పంచ్ శోభ, మండల సర్వేయర్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు గురువారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కలెక్టర్‌కు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు రాఖీలు కడుతున్న సమయంలో కలెక్టర్ వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. వారు ఏ తరగతుల్లో చదువుతున్నారో, పాఠశాలలో విద్యాభ్యాసం ఎలా కొనసాగుతోందో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆసక్తులు, భవిష్యత్తు లక్ష్యాలు, కుటుంబ వివరాల గురించి తెలుసుకొని వారిని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో రాఖీ పండుగకు విశిష్ట స్థానం ఉందన్నారు. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా రాఖీ నిలుస్తుందని పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పండుగగా రాఖీ పౌర్ణమి ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. మహిళల పట్ల గౌరవం, భద్రత, బాధ్యత అనే సందేశాన్ని ఈ పండుగ సమాజానికి అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. కుల, మత భేదాలకు అతీతంగా మానవత్వం, ప్రేమానురాగాలు, సోదరభావాన్ని పెంపొందించే వేడుకగా రాఖీ పౌర్ణమి నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం శ్రావణ పౌర్ణమి సందర్భంగా జరుపుకునే ఈ పండుగ భారతీయ సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెబుతోందన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, ముఖ్యంగా మహిళలు, సోదరీమణులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి కుటుంబంలో సంతోషం, సౌభ్రాతృత్వం, ప్రేమానురాగాలు వెల్లివిరియాలని, ఈ పండుగ ప్రజల మధ్య ఆత్మీయతను మరింత పెంపొందించాలని ఆకాంక్షించారు.

అనంతరం విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడిన కలెక్టర్, వారి విద్యాభ్యాసం, ఆసక్తులు, భవిష్యత్తు లక్ష్యాలపై ఆరా తీశారు. విద్యార్థులు కూడా తమ చదువులు, కుటుంబ పరిస్థితులు, పాఠశాల అనుభవాలను కలెక్టర్‌తో పంచుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులను అభినందిస్తూ కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు.

తమకు ఆసక్తి ఉన్న రంగంలో పట్టుదలతో ముందుకు సాగాలని, క్రమశిక్షణ, సమయపాలన, మంచి నడవడికతో విద్య పట్ల అంకితభావం కనబరిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, పాఠశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

రాఖీ పండుగ సందర్భంగా కలెక్టర్‌ను కలిసి రాఖీలు కట్టడం ఎంతో ఆనందంగా ఉందని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు తెలిపారు. కలెక్టర్ తమతో ఆప్యాయంగా మాట్లాడి చదువులు, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకోవడం సంతోషంగా అనిపించిందన్నారు. చిన్నారులు, కలెక్టర్ మధ్య జరిగిన ఈ ఆత్మీయ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# చెర్కూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



**వెల్దండ, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల పరిధిలోని చెర్కూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోటి విద్యార్థులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. సర్పంచ్ బచ్చలకూర శ్రీనివాసులు మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ తోబుట్టువుల మధ్య అనురాగానికి, ఆత్మీయతకు, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. చిన్నారుల్లో సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడంతోపాటు, ఒకరికొకరు తోడుగా నిలవాలనే భావనను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండలు, కేశమోని జంగయ్య, అల్లే సందీప్, ఉపాధ్యాయురాలు గీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లెంకలపల్లిలో డిజిటల్ క్రాప్ సర్వేపై రైతులకు అవగాహన



**మర్రిగూడ, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పంటల వివరాల నమోదులో భాగంగా మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని రైతు వేదికలో గురువారం రైతులకు డిజిటల్ క్రాప్ సర్వే, పంట నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి సాహస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ.. రైతులు తాము సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి ధాన్యానికి మాత్రమే క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ లభిస్తుందని తెలిపారు. పంట వివరాల నమోదుతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు రైతులకు మరింత సౌలభ్యం కలుగుతుందని వివరించారు.రైతులు డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియకు సహకరించి, తమ పంట వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు.కార్యక్రమంలో లెంకలపల్లి గ్రామ సర్పంచ్ అయితగోని పద్మ వెంకటయ్య గౌడ్, ఉపసర్పంచ్ శంకర్, ఏఈవో అరుణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ర్యాకల్‌దేవ్‌పల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**ఎలిగేడు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పెద్దపల్లి డీఎల్‌పీఓ దేవకి దేవి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా డీఎల్‌పీఓ దేవకి దేవి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకంగా, సులభంగా నిత్యావసర సరుకులు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయో జనాలు చేరేలా కృషి చేస్తామన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే. అశోక్, జీపీఓ షఫీ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పూలతో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు



**ఎలిగేడు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ ఆధ్వర్యంలో ప్రకృతి పూలతో అందమైన రాఖీలను తయారు చేసి వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి సంపత్ మాట్లాడుతూ.. సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి వేడుకలను ప్రకృతి పూలతో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ సహజసిద్ధమైన పూలతో రాఖీలు తయారు చేయడం ద్వారా ప్రకృతిపై ప్రేమను చాటుకోవచ్చని తెలిపారు.ప్రకృతి పూలతో రూపొందించిన రాఖీలను పరస్పరం కట్టుకుని సోదరభావాన్ని చాటుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలి పారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే. అశోక్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడిగా దేవరపాగ బంగారయ్య



**నాగర్‌కర్నూల్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య ఉద్యోగుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2026--28 సంవత్సరాలకు సంబంధించిన జిల్లా కార్యవర్గ ఎన్నికలు గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర ంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించిన జిల్లా సమావేశంలో జరిగాయి.రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా దేవరపాగ బంగారయ్య, అధ్యక్షులుగా వేముల కుర్మయ్య, ప్రధాన కార్యదర్శిగా కుందేటి మహేష్, కోశాధికారిగా కొత్త పరశురాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పారిజాత, బొల్లం శ్రీశైలం, నరసింహ, బాల నారాయణ, నాగేశ్వరరావులను, సహాయ కార్యదర్శులుగా జయమ్మ, శేఖర్, వెంకటేష్, నరేందర్ గౌడ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ఉద్యోగుల సంక్షేమం కోసం సమష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## రాఖీ బంధం.. ప్రేమానురాగాలకు ప్రతీక

**- రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుభాకాంక్షలు**



**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అన్నాచెల్లెళ్ల పవిత్ర అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు, ముఖ్యంగా అక్కాచెల్లెళ్లు, అన్నదమ్ములకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి కేవలం పండుగ మాత్రమే కాదని, అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనురాగం, నమ్మకాన్ని మరింత బలోపేతం చేసే పవిత్రమైన బంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. రాఖీ కట్టడం ద్వారా అక్కాచెల్లెళ్లకు అండగా నిలుస్తామనే భరోసా, వారి సంక్షేమం పట్ల బాధ్యతను గుర్తు చేసుకోవడం జరుగుతుందని అన్నారు. మహిళల గౌరవం, భద్రత, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో స్వావలంబన సాధించి ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రాఖీ పౌర్ణమి ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం, సోదరభావాన్ని నింపాలని, అన్నాచెల్లెళ్ల అనుబంధం చిరకాలం వర్ధిల్లాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆకాంక్షించారు.

# కస్తూర్బా హాస్టల్ ఎదుట ఏబీవీపీ ధర్నా



**దేవరకొండ, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో కస్తూర్బా హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ, విద్యార్థినులు చేసిన ఆరోపణల ప్రకారం కెమిస్ట్రీ, ఫిజిక్స్ లెక్చరర్ల వేధింపులు, తరగతి గదిలో పరుష పదజాలంతో దూషించడం, చదువులో వెనుకబ డుతున్నామనే ఒత్తిడి వంటి కారణాల వల్ల వారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసిందన్నారు.అంతేకాకుండా, విద్యార్థినులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వెంటనే వారిని ఆస్పత్రికి తరలించకుండా, వారితో లేఖలు రాయించుకొని ఘటనను కప్పిపుచ్చే ప్రయత్నం జరిగిందన్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు కారణమైన లెక్చరర్లను తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు.

విద్యార్థినుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు భయరహితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గోపీచంద్ పేర్కొన్నారు.ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థినులు ఆదిరాల వైష్ణవి, బాపిశాక భాను అని తెలిపారు. వీరిద్దరూ కొండమల్లేపల్లి కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ చదువుతున్నట్లు చెప్పారు.దేవరకొండ ఆర్డీవో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి నూతనగంటి గణేష్, శివరామరాజు కె., గోవింద్, దెల బాలరాజ్, హమ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ ఎఫెక్ట్.. కిటకిటలాడుతున్న నల్గొండ బస్టాండ్



**నల్గొండ, ఆగస్టు 27(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా నల్గొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. పండుగను పురస్కరించుకుని తమ స్వగ్రామాలు, బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు పెద్ద సంఖ్యలో ప్రయాణికులు బస్టాండ్‌కు చేరుకుంటున్నారు.శుక్రవారం రాఖీ పండుగ కావడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల కోసం మహిళా ప్రయాణికులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు బసాండ్‌లో భారీగా కనిపించారు. మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అధిక సంఖ్యలో మహిళలు బస్సుల వద్దకు చేరుకున్నారు.ఉచిత బస్సులతో పాటు నాన్‌స్టాప్, లగ్జరీ, సెమీ లగ్జరీ సర్వీసుల్లోనూ ప్రయాణికుల రద్దీ పెరిగింది. బస్సుల్లో సీట్లు పొందేందుకు పలువురు క్యూలైన్లలో నిలబడి తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఎదురుచూశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో పాటు అవసరమైన చోట అదనపు బస్సులను కూడా అందుబాటులో ఉంచారు. రాఖీ పండుగ నేపథ్యంలో బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో సందడిగా మారింది.

# నల్లగొండలో నర్సింగ్ సిబ్బంది ఆందోళన

**- మద్దతు తెలిపిన తెలంగాణ ఆల్ నర్సెస్ ఫెడరేషన్**



**నల్లగొండ, ఆగస్టు 27(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది చేపట్టిన ఆందోళనకు తెలంగాణ ఆల్ నర్సెస్ ఫెడరేషన్ (టీఏఎన్ఎఫ్) పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వల్లపుదాసు భూలక్ష్మి తెలిపారు.గురువారం సాయంత్రం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించి ఆందోళన చేస్తున్న నర్సింగ్ సిబ్బందిని కలిసిన భూలక్ష్మి, వారికి నైతిక మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాత్రింబవళ్లు రోగులకు సేవలందిస్తున్న నర్సింగ్ సిబ్బంది పట్ల అనుచిత పదజాలం ఉపయోగించడం, అనవసర ఒత్తిడికి గురిచేయడం తీవ్రంగా ఖండనీయమని అన్నారు. ఒకే నెలలో 14 మంది నర్సింగ్ సిబ్బందికి జారీ చేసిన మెమోలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న నర్సింగ్ సిబ్బందికి తాగునీరు, డ్రెస్ మార్చుకునే గదులు, వాష్‌రూమ్‌లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, పని ప్రదేశంలో భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ప్రతి చిన్న విషయానికీ మెమోలు జారీ చేయడం, వారాంతపు సెలవులను రద్దు చేయడం వంటి చర్యలను మానుకోవాలని కోరారు. నర్సింగ్ సిబ్బంది ఆందోళనకు దారితీసిన పరిస్థితులపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వారికి న్యాయం చేయాలని తెలంగాణ ఆల్ నర్సెస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోందని తెలిపారు.

ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు సానుకూలంగా పరిష్కరించాలని భూలక్ష్మి కోరారు.

# టూ టౌన్‌లో చేపల మార్కెట్ నిర్మించాలి: సీపీఎం



**నల్లగొండ, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్లగొండ టూ టౌన్ ప్రాంతంలో ప్రత్యేక చేపల మార్కెట్ నిర్మించి, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో రోడ్డుపై చేపలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్న వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు హషం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం చేపల విక్రయదారుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, నల్లగొండ పట్టణంలోని పానగల్లు ఫ్లైఓవర్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద సుమారు 100 మంది పేద కుటుంబాలు చేపల విక్రయాల ద్వారా జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపించకుండా అక్కడి నుంచి తొలగించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయం తీసుకోవడం అన్యాయమని పేర్కొన్నారు.చేపల విక్రయదారులకు సరైన ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, ప్రాథమిక సౌకర్యాలతో కూడిన చేపల మార్కెట్ ఏర్పాటు చేసిన తర్వాతే ప్రస్తుత ప్రాంతాన్ని ఖాళీ చేయించాలని సూచించారు. చేపల విక్రయాలే జీవనాధారంగా ఉన్న కుటుంబాల ఉపాధిని దెబ్బతీసే చర్యలను విరమించుకోవాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చేపల విక్రయాలను నియంత్రించే ముందు సంబంధిత వ్యాపారుల పునరావాసంపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే పేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరియు మున్సిపల్ అధికారులు మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యుడు అద్దంకి నరసింహ, చేపల విక్రయదారుల సంఘం నాయకులు మంగేనపల్లి శంకరయ్య, గుండు అంజయ్య, రాసమల్ల యాదయ్య, గుండు సైదులు, వద్దే పద్మ, గుండు మంగమ్మ, బొమ్మరబోయిన పద్మ, రాసమల్ల మల్లమ్మ, గుండు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి పోలీస్ సిబ్బందితో సహచరి రక్షాబంధన్ వేడుకలు



**మేడిపల్లి, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రక్షాబంధన్ సందర్భంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. మేడిపల్లి సీఐ జలేందర్ రెడ్డి, ఎస్ఐలు, పెట్రోల్ కార్ సిబ్బంది, బీసీఎస్ సిబ్బంది కలిసి సహచరి హౌసెస్‌ను సందర్శించి మహిళా సభ్యులతో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సహచరి సభ్యులు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీసు సిబ్బంది మహిళలకు చీరలు, బ్లౌజ్ ముక్కలు, శాలువాలు, పసుపు, కుంకుమ వంటి బహుమతులను అందజేశారు.తదనంతరం సహచరి సభ్యులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జలేందర్ రెడ్డి మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది అందరూ ప్రజలతో సోదర భావంతో వ్యవహరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదులతో వచ్చే వారిని సైతం ఆత్మీయంగా స్వాగతిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.మహిళల భద్రతకు సంబంధించిన అంశాలతో పాటు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక భద్రత అంశాలపై సహచరి సభ్యులకు అవగాహన కల్పించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, వ్యక్తిగత బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.రక్షాబంధన్ పండుగ పరస్పర ప్రేమ, గౌరవం, రక్షణ భావనకు ప్రతీక అని పేర్కొన్న సీఐ, పోలీసు శాఖ ఎల్లప్పుడూ ప్రజల భద్రత కోసం కట్టుబడి ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేడిపల్లి పోలీస్ సిబ్బంది, సహచరి సభ్యులు, మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎలిగేడులో ఘనంగా ముందస్తు రాఖీ వేడుకలు

**- అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా సోదరభావ సందేశం**

**- సర్పంచ్ కప్పల ప్రవీణ్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన మహిళలు**



**ఎలిగేడు, ఆగస్టు 27(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాఖీ పౌర్ణమి వేడుకల సందడి ముందుగానే ఎలిగేడు మండల కేంద్రంలో కనిపించింది. గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముందస్తు రాఖీ వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా గ్రామ మహిళలు సర్పంచ్ కప్పల ప్రవీణ్‌తో పాటు సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ ముంజం నరేష్ కుమార్‌లకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని, ఆప్యాయతను చాటుకున్నారు. సోదరభావానికి ప్రతీకగా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ కప్పల ప్రవీణ్ మాట్లాడుతూ, అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవాలను మరింత బలపరుస్తుందని అన్నారు. ఎలిగేడు గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గ్రామంలో సోదరభావం, ఐక్యత, సామరస్యం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు .వేడుకల్లో సింగిల్ విండో చైర్మన్ సామ రాజేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ ముంజం నరేష్ కుమార్, మాజీ వార్డు సభ్యుడు భోగే సతీష్, మహిళా సోదరీమణులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అక్షర కాన్సెప్ట్ పాఠశాలలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

**వెల్దండ, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండల కేంద్రంలోని అక్షర కాన్సెప్ట్ పాఠశాలలో ప్రిన్సిపాల్ కే. జార్జ్ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పండుగ సందడి నెలకొనగా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని సోదరభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే. జార్జ్ మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సోదరభావం, పరస్పర గౌరవం, ఆత్మీయత వంటి విలువలను పెంపొందించడమే ఇలాంటి వేడుకల ఉద్దేశమన్నారు.విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సుమారు 380 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదయ్య, పీటర్, ఆనంద్, ఉపాధ్యాయినులు రాణి, ప్రేమలత, స్వాతి, శశిరేఖ, సాయి ప్రసన్న, శోభ, సంధ్య, సునీత, రూపవతి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ ఎన్నిక



**నల్లగొండ, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ ఎన్నికలను గురువారం నల్లగొండ పట్టణంలోని సంస్థ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాజీ సర్పంచ్ పల్లెబోయిన నాగార్జున యాదవ్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కలకుంట్ల వినోద్ చారి, రాష్ట్ర కార్యదర్శిగా బొజ్జ ధనుంజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
నూతనంగా ఎన్నికైన నాయకులు మాట్లాడుతూ, తమ ఎన్నికకు సహకరించిన ప్రజా హక్కుల సాధన సమితి వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షుడు తిరుగమల్ల షాలెం రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ప్రజా సమస్యల పరిష్కారానికి సంస్థ మరింత కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంస్థను బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర, జిల్లా నాయకులు, సభ్యులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓనం వేడుకల్లో.. వెల్లువెత్తిన ఉత్సాహం

**– అరబిందో పాఠశాలలో ఘనంగా సంబరాలు.. కేరళ సంస్కృతిపై విద్యార్థులకు అవగాహన**



**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణంలోని అరబిందో ఉన్నత పాఠశాలలో కేరళ రాష్ట్ర ప్రత్యేక పండుగ ఓనం వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి మాట్లాడుతూ ఓనం పండుగ విశిష్టత, కేరళ సంస్కృతి, సంప్రదాయాల్లో దాని ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. వివిధ కార్యక్రమాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పండుగ విశిష్టతను చాటారు. ఓనం పండుగ సోదరభావం, ఐక్యత, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందని, విద్యార్థులు భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలను గౌరవించాలని ప్రిన్సిపాల్ సూచించారు. పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొనడంతో విద్యార్థులు ఆనందోత్సాహాలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, నరేష్, నజీర్, రతీష్, శేఖర్, శ్రీను, రఘు, రాధా, సునీత, సౌజన్య, ప్రేమలత, భార్గవి, సంధ్య, శైలజ, యామిని, నహీదా, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఒకే రకమైన నొప్పిని వ్యక్తులు వేర్వేరుగా అనుభవిస్తారు..



ఒకే రకమైన గాయం ఇద్దరికి అయినప్పటికీ.. ఒకరికి తీవ్రమైన నొప్పి అనిపిస్తే, మరొకరు అదే గాయాన్ని తక్కువ నొప్పితోనే భరిస్తారు. అలాగే ఒకరు త్వరగా కోలుకుంటే, మరొకరికి పూర్తిగా కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. గాయం తీవ్రత ఒక్కటే నొప్పిని, కోలుకునే వేగాన్ని నిర్ణయించదని నిపుణులు చెబుతున్నారు. మెదడు, నరాలు, జన్యువులు, వయసు, ఆరోగ్య పరిస్థితులు, ఒత్తిడి, చికిత్స, పునరావాసం వంటి అనేక అంశాలు నొప్పి అనుభూతిని, రికవరీని ప్రభావితం చేస్తాయి. శరీరంలోని కణజాలం దెబ్బతిన్నప్పుడు నొప్పిని గుర్తించే ప్రత్యేక నరాల చివరలు స్పందిస్తాయి. వేడి, ఒత్తిడి లేదా కణజాలానికి జరిగిన నష్టం వంటి ప్రమాదకరమైన ఉద్దీపనలను ఇవి గుర్తించి, పరిధీయ నరాలు, వెన్నుపాము ద్వారా మెదడుకు సంకేతాలను పంపిస్తాయి. ఆ సంకేతాలను మెదడు విశ్లేషించి నొప్పిగా అనుభూతి చెందేలా చేస్తుంది. అయితే ఈ నొప్పి తీవ్రత కేవలం గాయం ఎంత పెద్దదన్నదానిపైనే ఆధారపడదు. జన్యువులు, వయసు, ఆరోగ్య పరిస్థితులు, ఒత్తిడి, భయం, గత అనుభవాలు, అంచనాలు, సామాజిక మద్దతు వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి.

నొప్పి అంటే..నొప్పి అనేది కేవలం శరీరంలో కణజాలం దెబ్బతిన్నదానికి కొలమానం కాదు. ఇది శారీరక, మానసిక, సామాజిక అంశాల కలయికతో ఏర్పడే వ్యక్తిగత అనుభవం. అందుకే ఒకే రకమైన గాయం ఉన్న ఇద్దరు వ్యక్తులు పూర్తిగా భిన్నమైన స్థాయిలో నొప్పిని అనుభవిస్తారు. నొప్పి ప్రధానంగా వివిధ విధానాల్లో కనిపిస్తుంది. కణజాలం దెబ్బతినడం లేదా వాపు కారణంగా వచ్చే నొప్పిని నోసిసెప్టివ్ పెయిన్ అంటారు. నరాల వ్యవస్థకు నష్టం కలిగినప్పుడు వచ్చే నొప్పిని న్యూరోపాథిక్ పెయిన్ అంటారు. స్పష్టమైన కణజాల లేదా నరాల నష్టం లేకపోయినా నొప్పిని ప్రాసెస్ చేసే విధానంలో మార్పుల వల్ల కలిగే నొప్పిని నోసిప్లాస్టిక్ పెయిన్‌గా పేర్కొంటారు. నొప్పిని ఎంత తీవ్రంగా అనుభవిస్తామన్నదానిలో నాడీ వ్యవస్థ, జన్యువులు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. నొప్పి సంకేతాలను నియంత్రించే అనేక రసాయనాలు, రిసెప్టర్లు, నాడీ మార్గాలు శరీరంలో ఉంటాయి. వీటి స్పందనలో వ్యక్తుల మధ్య జన్యుపరమైన తేడాలు ఉంటాయి. నరాల చివరల సున్నితత్వం, హార్మోన్లు, శరీరంలోని వివిధ రసాయనాల ప్రభావం మారడం వల్ల కూడా ఒకే గాయానికి ఇద్దరు వ్యక్తులు భిన్నంగా స్పందిస్తారు.వయస్సు, ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలు..వయసు, ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలు కూడా నొప్పి, రికవరీపై ప్రభావం చూపుతాయి. మధుమేహం, ఆస్టియోపోరోసిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ వంటి దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు గాయానికి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులతో పోలిస్తే భిన్నంగా స్పందిస్తారు. ముఖ్యంగా మధుమేహం కారణంగా ఎక్కువకాలం రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉంటే పరిధీయ నరాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. దీనివల్ల నొప్పి, తిమ్మిరి, జలదరింపు లేదా స్పర్శ, వేడి, నొప్పిని గుర్తించే సామర్థ్యం తగ్గడం వంటి సమస్యలు వస్తాయి. నొప్పి తక్కువగా ఉందని గాయం కూడా చిన్నదే అని భావించడం సరికాదు. నరాల స్పందన తగ్గిపోయిన వ్యక్తికి తీవ్రమైన గాయం అయినప్పటికీ పెద్దగా నొప్పి అనిపించదు. మరోవైపు బయటకు కనిపించే గాయం చిన్నదిగా ఉన్నప్పటికీ కొంతమందికి తీవ్రమైన నొప్పి ఉంటుంది. ఒకేలా కనిపించే రెండు గాయాల వల్ల శరీరం లోపల జరిగే నష్టం కూడా వేర్వేరుగా ఉంటుంది. కొన్ని సందర్భాల్లో సూక్ష్మస్థాయిలో జరిగిన నష్టం వెంటనే సాధారణ పరీక్షల్లో కనిపించదు. రక్తనాళాలకు నష్టం, శరీరంలోని కొన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గడం, అంతర్గత రక్తస్రావం లేదా అధిక రక్తనష్టం వంటి అంశాలు గాయం తర్వాత పరిస్థితి ఎలా మారుతుందన్నదానిపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా తలకు గాయం అయినప్పుడు బయటకు కనిపించే గాయం తీవ్రతను బట్టి లోపల పరిస్థితిని అంచనా వేయడం సాధ్యం కాదు.

తలకు గాయం అయితే..తలకు గాయం అయినప్పుడు నొప్పి ఎంత ఉందన్నదానికంటే వైద్య సహాయం ఎంత త్వరగా అందిందన్నది కూడా చాలా ముఖ్యం. మెదడు గాయాల్లో రక్తస్రావం, వాపు, గాయాలు లేదా మెదడు పనితీరును ప్రభావితం చేసే ఇతర మార్పులు సంభవిస్తాయి. కొన్ని లక్షణాలు వెంటనే కనిపించవు. లేదా కొంత సమయం తర్వాత మరింత స్పష్టంగా మారుతాయి. అందువల్ల తలకు గాయం అయిన తర్వాత పరిస్థితిని నిర్లక్ష్యం చేయకుండా చేయించుకోవాలి.

## ఎలిగేడు మండలంలో ఎస్ఐఆర్‌పై ప్రత్యేక గ్రామసభలు

**– ఓటర్ల జాబితా సవరణలపై ప్రజలకు అవగాహన**
**– అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించడమే లక్ష్యం: తహసీల్దార్ యాకన్న**



**ఎలిగేడు, ఆగస్టు 27(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఓటర్ల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా గ్రామసభలను బుధవారం నిర్వహించారు. గ్రామాల వారీగా నిర్వహించిన ఈ సమావేశాల్లో ఓటర్ల జాబితాల పరిశీలన, సవరణలు, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.
ఎలిగేడు, లోకపేట గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు తహసీల్దార్ యాకన్న హాజరై మాట్లాడారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తైన అనంతరం గుర్తించిన కొన్ని తప్పిదాలను మరోసారి పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఓటరికి అవసరమైన సవరణలు చేసుకునే అవకాశం కల్పించడమే ఈ గ్రామసభల ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.
ఓటర్ల జాబితాలోని పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను ప్రజలు స్వయంగా పరిశీలించి, ఏవైనా తప్పులు లేదా లోపాలు గుర్తించినట్లయితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల సహకారంతోనే ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, తప్పులులేకుండా రూపొందించవచ్చని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, కొమురయ్య, ఏలేటి వెంకటరెడ్డి, రాధ-గంగాజమున, రంగు లత-శ్రీనివాస్ గౌడ్, మద్దెల రమాదేవి-సంపత్, వాణి, రజిత-లక్ష్మారెడ్డి, పల్లెర్ల వెంకటేష్ గౌడ్, తిరుపతి యాదవ్, మండల అధికారులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కట్ట మైసమ్మ బోనాలు

**– మహిళల బోనాల సమర్పణతో ఆలయంలో పండుగ వాతావరణం**
**– అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించిన భక్తులు**



**ఆమనగల్లు, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు పట్టణంలో కట్ట మైసమ్మ బోనాల వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కట్ట మైసమ్మ దేవాలయ కమిటీ చైర్మన్, కౌన్సిలర్ మొక్తల వెంకటయ్య, ముదిరాజ్ సంఘం నాయకుడు ఎర్రవోలు యాదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకుని ఆలయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అమ్మవారికి నైవేద్య సమర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, కౌన్సిలర్లు పాపిశెట్టి రాము, ఎర్రవోలు మహేష్, ఎనుమల్ల రమేష్, దుద్దు ఆంజనేయులు యాదవ్, నాగిళ్ల జగన్, పుల్లారెడ్డి అనూష శ్రీశైలం, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలి ంగం, నాయకులు పూసల సత్యం, కండె భాస్కర్, సుందూరు శేఖర్, కండె సాయి, వస్పుల శ్రీకాంత్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం నాయకులు మొక్తల చిన్న వెంకటయ్య, అంజయ్య, కేకే శీను, రాజు, మల్లేష్, నరసింహ, వెంకటేష్, సైదులు, అనిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

**– ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**
**– లంచ్ టైమ్ డెమాన్‌స్ట్రేషన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న సిబ్బంది**




**కరీంనగర్, ఆగస్టు 27 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ స్టేట్ టీఎన్‌జీవోస్ (జేఏసీ), తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య (ఖమీజూా) పిలుపు మేరకు శాతవాహన విశ్వవిద్యాలయంలో నాన్ టీచింగ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవనం ఎదుట నిర్వహించిన లంచ్ టైమ్ డెమాన్‌స్ట్రేషన్‌లో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను వెంటనే అమలు చేసి ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలను తొలగించాలని నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో శాతవాహన విశ్వవిద్యాలయ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, శాతవాహన ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు చురుకుగా పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని కోరారు.
కార్యక్రమంలో అసోసియేషన్ హానరరీ ప్రెసిడెంట్ వై. కిషోర్, ప్రెసిడెంట్ ఆర్. భీమయ్య, జనరల్ సెక్రటరీ టీ. రాజేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్. నరసయ్యతో పాటు సభ్యులు రమేష్, సాయి, శ్రీకాంత్, సంతోష్ కుమార్, యోజన, లచ్చయ్య, నూరుద్దీన్, ఫాసిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టైమ్ స్కేల్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై నిరసనకు మద్దతు ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి, ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

## బరువు తగ్గించడంలో జీఎల్‌పీ-1 మందులా పనిచేస్తున్న ఈ పండు..

బరువు తగ్గేందుకు సహజ మార్గాలను అనుసరించాలని కోరుకునే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో ఇటీవల బార్బెర్రీ బెరడు, అందులో ఉండే బెర్బెరిన్ అనే మొక్కల సమ్మేళనం గురించి చర్చ ఎక్కువగా జరుగుతోంది. కొందరు దీనిని నేచర్స్ ఓజెంపిక్ గా కూడా పిలుస్తున్నారు. అయితే నిజంగా ఇది బరువు తగ్గించడంలో ఎంతవరకు సహాయపడుతుంది? దీనిపై అందుబాటులో ఉన్న పరిశోధనలు ఏం చెబుతున్నాయో తెలుసుకోవడం ముఖ్యం. బెర్బెర్రీ బెరడు సంప్రదాయ వైద్యంలో ఉపయోగించే ఒక మూలికా పదార్థం. దీన్ని సప్లిమెంట్ రూపంలో బరువు తగ్గేందుకు ఉపయోగిస్తున్నారు. ఇందులో ఉండే బెర్బెరిన్ అనే క్రియాశీల సమ్మేళనం శరీరంలోని రక్తంలో చక్కెర స్థాయిలు, గ్లూకోజ్ మెటబాలిజం, కొవ్వు జీవక్రియ వంటి అంశాలపై ప్రభావం చూపుతుందని చెబుతున్నారు. బార్బెర్రీ బెరడును నేచర్స్ ఓజెంపిక్ గా పిలవడానికి ప్రధాన కారణం రక్తంలో చక్కెర నియంత్రణపై బెర్బెరిన్ చూపే ప్రభావం. ఆన్‌లైన్‌లో దీనికి ఆదరణ పెరగడంతో బరువు తగ్గేందుకు సహజ ప్రత్యామ్నాయంగా కూడా ప్రచారం జరుగుతోంది. అయితే మూలికా సప్లిమెంట్, జీఎల్‌పీ-1 తరహా మందులు ఒకే విధంగా పనిచేయవని గుర్తుంచుకోవాలి. వాటిని ఉపయోగించే విధానం, ఉపయోగాలు భిన్నంగా ఉంటాయి.



బరువును తగ్గిస్తుందా..బెర్బెరిన్ బరువు తగ్గడంలో ఎలా సహాయపడుతుందనే దానిపై కొన్ని పరిశోధనలు జరిగాయి. ఇందులోని మొక్కల ఆల్కలాయిడ్లు ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడంలో, రక్తంలో చక్కెర నియంత్రణకు సహకరించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అలాగే గ్లూకోజ్ మెటబాలిజం, జీర్ణవ్యవస్థ పనితీరు, గట్ మైక్రోబయోటాపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశోధనలు పేర్కొంటున్నాయి. కొవ్వు జీవక్రియపై కూడా బెర్బెరిన్ ప్రభావం చూపిస్తుందని చెబుతున్నారు. ఊబకాయంతో సంబంధం ఉన్న వాపు ప్రక్రియలను తగ్గించడంలో కూడా ఇది కొంత కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే ఇవన్నీ బరువు తగ్గేందుకు దీనిని కచ్చితమైన పరిష్కారంగా నిర్ధారించడానికి సరిపోవు. బార్బెర్రీ బెరడు లేదా బెర్బెరిన్ బరువు తగ్గించగలదా అనే అంశంపై ఇప్పటివరకు వచ్చిన పరిశోధనల్లో కొన్ని సానుకూల ఫలితాలు కనిపించాయి. అయితే శరీర బరువు లేదా బాడీ మాస్ ఇండెక్స్‌లో గణనీయమైన మార్పులు కనిపించలేదని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. నడుము-తుంటి నిష్పత్తిలో మాత్రం స్వల్ప తగ్గుదల కనిపించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అందువల్ల దీన్ని ఓజెంపిక్‌తో సమానమైన శక్తివంతమైన బరువు తగ్గించే సాధనంగా పరిగణించడం సరైంది కాదు. దీనిపై మరింత క్లినికల్ పరిశోధన అవసరం.

షుగర్ లెవల్స్‌పై ప్రభావం..బార్బెర్రీ బెరడులోని సమ్మేళనాలు బరువు తగ్గడం మాత్రమే కాకుండా రక్తంలో చక్కెర నియంత్రణ, ఇన్సులిన్ నిరోధకత, మెటబాలిక్ సిండ్రోమ్, కొలెస్ట్రాల్ స్థాయిలు, గుండె-మెటబాలిక్ ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై కూడా ప్రయోజనకరంగా ఉండే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే ప్రతి ఒక్కరికీ బార్బెర్రీ బెరడు సురక్షితమైనదని చెప్పలేం. ముఖ్యంగా జీర్ణ సమస్యలు లేదా సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. కొన్ని మందులతో ఇది పరస్పర చర్యకు దారితీసే అవకాశం ఉంటుంది. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు దీనిని తీసుకునే ముందు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా మధుమేహానికి మందులు వాడుతున్న వారు బెర్బెరిన్ లేదా బార్బెర్రీ బెరడు వంటి సప్లిమెంట్లను స్వయంగా తీసుకోకుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

జీవనశైలి మార్పులు అవసరం..బరువు తగ్గేందుకు సప్లిమెంట్లపై మాత్రమే ఆధారపడటం కంటే శాస్త్రీయంగా నిరూపితమైన జీవనశైలి మార్పులకు ప్రాధాన్యత ఇవ్వడం మరింత ఉపయోగకరం. ఆహారంలో తగినంత ప్రోటీన్, ఫైబర్ ఉండేలా చూసుకోవడం, క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, బలవర్ధక వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం వంటి చర్యలు బరువు నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తాయి. బార్బెర్రీ బెరడులోని బెర్బెరిన్ మెటబాలిజానికి సంబంధించిన కొన్ని అంశాలపై ప్రయోజనకరమైన ప్రభావాలను చూపించే అవకాశం ఉన్నప్పటికీ, దీనిని ఓజెంపిక్‌కు సహజ ప్రత్యామ్నాయంగా భావించడం సరికాదు. బరువు తగ్గడం కోసం సురక్షితమైన, దీర్ఘకాలిక ఫలితాలను అందించే ఆహారం, వ్యాయామం, నిద్ర, ఒత్తిడి నియంత్రణ వంటి ఆరోగ్యకరమైన అలవాట్లకే ప్రధానంగా ప్రాధాన్యత ఇవ్వాలని నిపుణులు తెలియజేస్తున్నారు.




# టాక్సిక్‌పై మిక్స్‌డ్ టాక్

## భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియా కూత

కేజీఎఫ్ స్టార్ యశ్ హీరోగా, దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్' కు రిలీజ్‌కు ముందు భారీ అంచనాలు నెలకొనడంతో అడ్వాన్స్ బుకింగ్స్‌లో అదిరిపోయే స్పందన లభించింది. అయితే సినిమా విడుదలైన తర్వాత మాత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. ప్రీమియర్ షోల నుంచే సినిమాపై డివైడ్ టాక్ మొదలైంది. అడ్వాన్స్ బుకింగ్స్ కారణంగా తొలి రోజు భారీ ఓపెనింగ్స్ నమోదైనప్పటికీ, దీర్ఘకాలంలో సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ మేరకు నిలబడుతుందన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో 'టాక్సిక్' తెలుగు థియేట్రికల్ హక్కులను దక్కించుకున్న ప్రముఖ నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ దిల్ రాజుకు భారీ నష్టాలు తప్పవంటూ సోషల్ మీడియాలో ప్రచారం మొదలైంది. 'టాక్సిక్' సినిమాపై ప్రారంభం నుంచే భారీ బజ్ నెలకొంది. యశ్‌కు 'కేజీఎఫ్' సిరీస్ తర్వాత దేశవ్యాప్తంగా వచ్చిన క్రేజ్, సినిమా భారీ స్థాయిలో రూపొందడం, పాన్ ఇండియా రిలీజ్ వంటి అంశాలు బిజినెస్‌పై ప్రభావం చూపాయి. ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో దిల్ రాజు తెలుగు హక్కులను దక్కించుకున్నారని ప్రచారం జరిగింది. ప్రీరిలీజ్ ఈవెంట్‌లోనూ సినిమాపై చిత్రబృందం చూపించిన విశ్వాసం భారీగా కనిపించింది. మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ మిశ్రా ఈ సినిమా రూ.2,000 కోట్ల వసూళ్ల సామర్థ్యం ఉన్న ప్రాజెక్ట్ అని చెప్పినట్లు దిల్ రాజు ప్రస్తావించడం అప్పట్లో వైరల్ అయింది.ఆ నమ్మకంతోనే తెలుగు రాష్ట్రాల్లో 'టాక్సిక్'ను భారీ ఎత్తున థియేటర్లలో విడుదల చేశారు. కానీ విడుదలైన మొదటి రోజే టాక్ అంచనాలకు భిన్నంగా రావడంతో ఇప్పుడు బాక్సాఫీస్ రన్‌పై చర్చ సాగుతోంది.'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడంతో కొందరు నెటిజన్లు దిల్ రాజు భారీగా నష్టపోతారంటూ పోస్టులు పెడుతున్నారు. రూ.100 కోట్ల వరకు నష్టం వస్తుందని కూడా సోషల్ మీడియాలో లెక్కలు వైరల్ అవుతున్నాయి.

# రంగస్థలంను మించి

## మరోమారు సుక్కుతో రామ్‌చరణ్ జోడీ



టాలీవుడ్ నుంచి రాబోతున్న అత్యంత క్రేజీ ప్రాజెక్టుల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, స్టార్ దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా కూడా ఒకటి. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'రంగస్థలం' టాలీవుడ్‌లో ఎంతటి సంచలన విజయాన్ని నమోదు చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఈ హిట్ కాంబినేషన్ మరోసారి జతకట్టబోతుండటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. రామ్ చరణ్ ఇటీవల 'పెద్ది'తో భారీ విజయాన్ని అందుకోగా, మరోవైపు సుకుమార్ 'పుష్ప 2'తో పాన్ ఇండియా స్థాయిలో సంచలనాత్మక విజయాన్ని నమోదు చేశారు. తమ తమ కెరీర్‌లో భారీ విజయాల తర్వాత ఈ ఇద్దరూ మరోసారి కలిసి పనిచేయబోతుండటం ఈ ప్రాజెక్ట్‌పై మరింత హైప్‌ను పెంచుతోంది. అంతేకాదు, 'రంగస్థలం' వంటి ఐకానిక్ సినిమాను అందించిన కాంబినేషన్ కావడంతో ఈసారి ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకు వస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది. సుకుమార్ మార్క్ కథనం, రామ్ చరణ్ ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్ మరోసారి కలిస్తే బాక్సాఫీస్ వద్ద మరో భారీ సంచలనం నమోదవుతుందని అభిమానులు ఇప్పటికే అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై నిర్మాత రవి శంకర్ చేసిన తాజా వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ కాంబినేషన్‌పై అభిమానులు ఎంతటి అంచనాలు పెట్టుకున్నా, వాటిని మించే స్థాయిలో సినిమా ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేసినట్లు సమాచారం. సినిమా టైటిల్, కథాంశం, ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్‌కు సంబంధించిన వివరాలు ఎప్పుడు బయటకు వస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. అధికారిక ప్రకటన వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. తాజా టాక్ ప్రకారం, ఈ భారీ ప్రాజెక్ట్ షూటింగ్ ఈ ఏడాది నవంబర్ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం రామ్ చరణ్, సుకుమార్ ఇద్దరూ తమ తమ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న నేపథ్యంలో, ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్ ఎలా ఉండబోతుందనేది కూడా ఆసక్తికరంగా మారింది.

# రకుల్ నోట శూర్పణఖ కథ.. తెలియని విషయాలు బయటపెట్టిన నటి!



రామాయణంలో శూర్పణఖ అంటే చాలామందికి వెంటనే గుర్తుకొచ్చేది ప్రతినాయకురాలి పాత్రే. కానీ, 'రామాయణ' చిత్రంలో తాను పోషిస్తున్న శూర్పణఖ పాత్రలో అంతకుమించిన కోణాలున్నాయని నటి రకుల్ ప్రీత్ సింగ్ చెప్పింది. ఆ పాత్రలోని అనేక అంశాలు తనను ఈ సినిమా వైపు ఆకర్షించాయని తెలిపింది.రావణుడి సోదరిగా శూర్పణఖ పాత్రలో రకుల్ కనిపించనుంది. లంకలో అత్యంత అందమైన మహిళల్లో ఆమె ఒకరని చెబుతారని రకుల్ గుర్తుచేసుకుంది. ఆమెకు అహంకారం ఉన్నప్పటికీ.. పాత్రలో చాలా కోణాలున్నాయని చెప్పింది. నటిగా అలాంటి పాత్రలను ఆవిష్కరించడం ఆసక్తికరంగా ఉంటుందని తెలిపింది. స్క్రిప్ట్ చదివే వరకు శూర్పణఖ జీవితం గురించి తనకు తెలియని విషయాలు చాలానే ఉన్నాయని రకుల్ చెప్పింది. లక్ష్మణుడు ఆమె ముక్కు కోసిన ఘటనకు ముందు, తర్వాత జరిగిన పరిణామాలను సినిమాలో కొత్త కోణంలో చూపిస్తున్నట్లు వెల్లడించింది. రాముడిని శూర్పణఖ ఎలా కలుస్తుందన్న విషయాల్లోనూ కొత్త అంశాలు తెలుసుకున్నానని తెలిపింది.రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యశ్, సన్నీ డియోల్, రవి దూబే కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం భారీ అంచనాల మధ్య తెరకెక్కుతోంది. 'రామాయణ: పార్ట్-1' 2026 నవంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# నటుడు నారాయణరావు కన్నుమూత




ప్రముఖ నటుడు జీవీ నారాయణ రావు (73) కన్నుమూశారు. ఆయన ఇకలేరనే విషాదకర వార్తను నటి కరాటే కల్యాణి సోషల్‌మీడియా వేదికగా వెల్లడించారు. నారాయణ రావు 100కు పైగా చిత్రాల్లో నటించారు. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం వహించిన 'అంతులేని కథ' చిత్రంతో నటుడిగా పరిచయమైన ఆయన.. తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా నంది అవార్డు అందుకున్నారు. మద్రాస్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్న నారాయణరావు.. రజనీకాంత్, చిరంజీవిలకు మంచి మిత్రుడే. 'అంతులేని కథ', 'ముత్యాల పల్లకి', 'అంగడి బొమ్మ', 'చిలకమ్మ చెప్పింది', 'గ్యాంగ్ లీడర్', హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ, యముడికి మొగుడు, పెళ్ళి నీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణరావు మృతిపై మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) సంతాపం తెలిపింది. నారాయణరావుకు ఒక కుమారుడు, కుమార్తె. ప్రస్తుతం ఇద్దరూ విదేశాల్లో ఉంటున్నారు. కృష్ణాజిల్లా కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణ రావు బాల్యం, విద్యాభ్యాసం గుంతకల్లులో సాగింది. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, ఎ.ఆర్.కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారు. చదువుకునే రోజులలో మహమ్మద్ బీన్ తుగ్లక్, ప్రతాపరుద్రీయం, మంచుతెర తదితర నాటకాలలో నటించారు. దివంగత సినిమా నటులు కోట శ్రీనివాసరావు, నూతన ప్రసాద్, దేవదాస్ కనకాల తదితరులు నారాయణరావుకు రంగస్థల మిత్రులు. సినిమాలతో పాటు పలు టి.వి.సీరియళ్లలోనూ నారాయణ రావు నటించారు.

-----------------

# రణబాలి రిలీజ్ అక్టోబర్16కు మార్పు




రౌడీ హీరో విజయ్ దేవరకొండ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి' పై కీలక అప్డేట్ వచ్చింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన సాంగ్, గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని క్రియేట్ చేశాయి. భారీ యాక్షన్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ముందుగా ఈ సినిమాను సెప్టెంబర్ 11 ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే కొన్ని కారణాలతో విడుదలను వాయిదా వేశారు.తాజాగా 'రణబాలి' కొత్త రిలీజ్ డేట్‌ను చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. అక్టోబర్ 16న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ లుక్‌తో కూడిన కొత్త పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో కనిపిస్తున్న ఇంటెన్స్ లుక్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. కొత్త రిలీజ్ డేట్ ప్రకారం దసరా సీజన్‌కు దగ్గరగా 'రణబాలి' ప్రేక్షకుల ముందుకు రానుంది. పండుగ సెలవులు, భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరో సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్‌పై మేకర్స్ భారీ ఆశలు పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇదే తేదీకి సూపర్‌స్టార్ రజినీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్ 2' కూడా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఆసక్తికరమైన బాక్సాఫీస్ క్లాష్‌కు తెరలేచింది. ఒకవైపు విజయ్ దేవరకొండకు తెలుగు రాష్ట్రాలతో పాటు నార్త్ ఇండియా, ఇతర భాషల్లోనూ మంచి మార్కెట్ ఉంది. మరోవైపు రజినీకాంత్‌కు దేశవ్యాప్తంగా భారీ ఫ్యాన్ బేస్ ఉండటంతో ఈ రెండు సినిమాల పోటీపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది.




# అల్లు అర్జున్‌కు అరుదైన గౌరవం

## ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్‌పై మెరిసిన హీరో

అగ్రకథానాయకుడు అల్లు అర్జున్ మరో ఘనత సాధించారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇండియా 'షోస్టాపర్స్ 2026' ప్రత్యేక సంచిక కవర్ పేజీపై ఆయన మెరిశారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ప్రస్తుత పరిస్థితులు, సినిమాలో కథ ప్రాముఖ్యతను ఆయన వివరించారు. బాలీవుడ్, దక్షిణాది సినిమా లేదా మరే ఇతర ప్రాంతీయ సినిమా అయినా సరే.. బాక్సాఫీస్ వద్ద ఆదరణ పొందాలంటే కథే ప్రధానం. మంచి కంటెంట్ ఉంటే భాషతో సంబంధం లేకుండా హిట్ అవుతుంది. కొత్త కథను ప్రేక్షకులకు అందించడమే అన్నిటికంటే ముఖ్యం' అని అల్లు అర్జున్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. సినిమాల్లోని నటీనటుల స్టార్‌డమ్ కంటే కూడా సరైన కథే చిత్ర విజయాన్ని నిర్ణయిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2025 జనవరి నుంచి 2026 మార్చి వరకు సినిమాలు, ఓటీటీ, క్రీడలు, సంగీతం, టెలివిజన్.. ఇలా వివిధ రంగాల్లో ప్రభావం చూపిన 100 మంది తారల జాబితాను 'షోస్టాపర్స్' పేరుతో ఫోర్బ్స్ ఇండియా తాజాగా విడుదల చేసింది. ఈ లిస్ట్‌లో ఇండస్ట్రీకి చెందిన పలువురు నటీనటులు చోటు దక్కించుకున్నారు. అల్లు అర్జున్‌తో పాటు అమితాబ్ బచ్చన్, మోహన్ లాల్, రజనీకాంత్, రామ్ చరణ్, షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, అక్షయ్ కుమార్, ఏఆర్ రెహమాన్, బాబీ దేవోల్, దుల్కర్ సల్మాన్, మాధవన్, రణ్‌వీర్ సింగ్, రిషబ్ శెట్టి, కల్యాణి ప్రియదర్శన్, కంగనా రనౌత్ ఇందులో ఉన్నారు.